



అమరావతికి మళ్లీ అంకురార్పణ

- రాజధానిలో పునర్నిర్మాణ పనులకు శ్రీకారం
- శాస్త్రోక్తంగా పూజలతో రాయపూడి వద్ద పనుల ప్రారంభం
- రైతుల హర్షధ్వానాల మధ్య సీఎం చంద్రబాబు భూమిపూజ
- మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి కావాలని సీఎం ఆదేశం

తుళ్లూరు, గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బాటలు వేసింది. ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులను అధికారంలోకి వచ్చిన ఐదో నెలలోనే తిరిగి ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం అడివిలా మార్చిన రాజధాని ప్రాంతంలో తొలుత జంగిల్ క్లియరెన్స్ చేపట్టింది. బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం చంద్రబాబు రాజధాని అంతటా పర్యటించారు. నిలిచిపోయిన పనులను పరిశీలించి వాటిని ఎలా తిరిగి పట్టాలెక్కించాలనే దానిపై అవగాహనకు వచ్చారు. మరోవైపు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తరచూ అమరావతిలో పర్యటించి పనుల పునః ప్రారంభానికి బాటలు వేశారు. ఈ పరిస్థితుల్లో ఎప్పటి నుంచి అమరావతి పనులు ప్రారంభిస్తారని రాజధాని ప్రాంత ప్రజలే కాకుండా రాష్ట్రమంతటా ఎదురు చూస్తున్న క్రమంలో శనివారం సీఎం చంద్రబాబునాయుడు అమరావతి పునర్నిర్మాణ పనులకు అంకురార్పణ చేశారు. ప్రజల హర్షధ్వానాల మధ్య శాస్త్రోక్తంగా పూజలతో రాజధాని పనులను ప్రారంభించారు. రాయపూడి వద్ద జీ ప్లస్ 7 విధానంలో నిర్మించతలపెట్టిన సీఆర్డీయే కార్యాలయం నిర్మాణం గత ప్రభుత్వంలో నిలిచిపోగా దాని నిర్మాణం పూర్తి చేసేందుకు పనులు పునః ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడారు. అమరావతిలో రూ.160 కోట్లతో జీ ప్లస్ 7 భవనం నిర్మిస్తున్నామని దీనిని 121వ రోజున ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రానికి అమరావతి ఒక్కటే రాజధానిగా ఉంటుందని స్పష్టం చేశారు. అమరావతే రాజధాని అని విశాఖ, కర్నూలు వాసులతో ఒప్పించానన్నారు. రైతులకు కౌలు పెండింగ్ నిధులు 170 కోట్లు ఇచ్చామని, రూ.225 కోట్లు త్వరలో ఇస్తామన్నారు.


రాజధాని పనులకు భూమిపూజ చేస్తున్న సీఎం చంద్రబాబు


రాజధాని మ్యాప్‌ను సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

విధ్వంసం పోయి.. నిర్మాణం ప్రారంభం

1631 రోజులు పాటు రాజధానిని కాపాడుకోవడం కోసం రైతులు ఉద్యమం చేశారని చంద్రబాబు తెలిపారు. విధ్వంసం పోయింది.. నిర్మాణం ప్రారంభమైందన్నారు. గత పాలకుల విధ్వంసంతో నిలిచిన పనుల వల్ల రూ.7 వేల కోట్లు అదనంగా భారం పడుతోందన్నారు. రూ.52 వేల కోట్లతో పనులు ప్రారంభిస్తామని, కేంద్రం రూ.15 వేల కోట్లు అందించేందుకు ముందుకొచ్చిందన్నారు. 8,603 కి.మీ సీఆర్డీయే, 217 చ.కిమీ పరిధిలో రాజధాని, 16.9 చ.కి పరిధిలో కోర్ కేపిటల్ ఉంటుందన్నారు. అమరావతిలో తలపెట్టిన పనులన్నీ మూడేళ్లలో పూర్తి కావాలని సీఆర్డీఏ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, అడిషనల్ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, ఎస్పీ సతీష్‌కుమార్, రైతు నాయకులు పువ్వాడ సుధాకరరావు జోజాల చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రమదేవిలా రాజధాని మహిళలు

అమరావతికి మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేశామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం కోసం రైతులు భూములు ఇస్తే గడిచిన ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టిందన్నారు. రాజధాని ఉద్యమ సమయంలో ఇక్కడి మహిళలు రాణీరుద్రమ దేవిలా పోరాడారన్నారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం కార్యక్రమం చేపడితే అన్నం తిననివ్వకుండా అడగడుగునా వేధించారన్నారు. ఈ పవిత్రమైన పుణ్యభూమిని మహిళ శక్తి కాపాడిందని తెలిపారు. ఎంతమంది రాక్షసులు వచ్చినా అమరావతిని కాపాడిన చరిత్ర రైతులదేనన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమరావతిపై విష ప్రచారం చేసిందన్నారు. ముంపు ఎడారి అన్న జగన్‌రెడ్డి బెంగళూరు ప్యాలెస్ మునిగిందన్నారు. దేవుడు స్క్రిప్ట్ అంటే ఇదేనని చంద్రబాబు తెలిపారు.

మగువ మేలుకో.. తెలుసుకో



- మహిళలకు రక్షణగా రాజ్యాంగం
- ప్రభుత్వం కల్పించిన చట్టాలు కోకొల్లలు
- అతివల అరచేతిలోనే టోల్ ఫ్రీ నెంబర్లు
- అవగాహన లేమితో తలెత్తుతున్న సమస్యలు
- మహిళలను చైతన్య పరచడంలో వెనకడుగే

8లో

అర్హులందరికీ సంక్షేమం అందాలి

- పారదర్శకంగా కేంద్ర పథకాలను అమలు చేయాలి
- దిశ కమిటీ చైర్మన్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్


బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వ నిధులతో అమలయ్యే సంక్షేమపథకాల ఫలాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందించాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం(దిశ) జరిగింది. కమిటీ చైర్మన్‌గా ఎంపీ పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. కేంద్రప్రభుత్వం ఖర్చుపెడుతున్న ప్రతి పైసా నిరుపేదలకు చేరాలని చెప్పారు. అత్యంత పారదర్శకంగా పథకాలను అమలు చేయాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుకబాటులో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూరాలన్నారు. ప్రతిఒక్కరికి విద్య, యువతలో నైపుణ్యాలు అభివృద్ధి, సూక్ష్మ,చిన్నతరహ పరిశ్రమలు స్థాపించేలా ఔత్సాహికుల ప్రోత్సాహంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రాథమిక వైద్యం ప్రతిఒక్కరికి అందాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు ఉపాధి చూపించాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదరికం నుంచి ప్రజలు విముక్తి పొందేలా అధికారులు పనిచేయాలన్నారు. అర్హులైన ఎస్టీలందరికీ జాబ్ కార్డులు జారీ చేయాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. కుళాయిల ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ వేదికపై కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

అసహనం.. ఆగ్రహం

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన గృహాల సమగ్ర వివరాలు లేకపోవడంపై అధికారులపై ఎంపీ తెన్నేటి అసహనం వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ కింద రూ.578 కోట్లు మంజూరు కాగా 40 శాతానికి మించి పనులు చేయకపోవటం ఏమిటని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను నిలదీశారు. పనులు చేసినా నిధులు విడుదల కాలేదని అధికారులు సమాధానం చెప్పగా తక్షణమే నివేదిక ఇవ్వాలని ఎంపీ సూచించారు. బాపట్లలో ఈఎస్ఐ ఆస్పత్రి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఎంపీ ల్యాడ్స్ నిధులు వినియోగంపై విజిలెన్స్ విచారణ చేయిస్తామన్నారు. ముద్రరుణాలు పంపిణీ లక్ష్యాలు చేరుకోవడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ గ్రామాల్లో సుస్థిర ఆస్తులు సమకూర్చడమే లక్ష్యంగా ఉపాధి నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పల్లెవనాలు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. 19 మండలాలలో 19 వేల ఇంకుడు గుంతలు తీయాలని లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో సమగ్ర విచారణ చేసి అర్హులకు మాత్రమే పింఛన్ అందించాలని అనర్హులను తొలగించాలన్నారు. సమావేశంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ప్రకాశం, గుంటూరు జడ్పీ సీఈవోలు చిరంజీవి, జ్యోతిబసు, అధికారులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ 12 క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల



మా భూముల్లో

ఇసుక మాకే

- కొల్లూరు ట్రాక్టర్లను అడ్డుకున్న పెసర్లంకవాసులు
- లాకు సెంటర్‌లో కొల్లూరు ఎస్సీకాలనీవాసుల ఆందోళన
- ఎస్ఐ ఏడుకొండలు జోక్యంతో సద్దు మణిగిన వివాదం

కొల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మా పట్టాభూముల్లోని ఇసుక మాకే సొంతం.. ఇతరులను రానివ్వం.. అని కొల్లూరు ఎస్సీ కాలనీవాసులకు చెందిన ఇసుక ట్రాక్టర్లను శనివారం పెసర్లంకలో స్థానికులు అడ్డుకున్నారు. ఆ తర్వాత కొల్లూరు ఎస్సీ కాలనీవాసులు లాకు సెంటరుకు చేరుకుని పెసర్లంక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎస్ఐ ఏడుకొండలు ఘటనా స్థలానికి చేరుకుని వారితో చర్చించారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక తీసుకు వెళ్లమని చెప్పినా పెసర్లంకవాసులు తమను అడ్డుకుని, దౌర్జన్యం చేస్తున్నారన్నారు. పైగా దేవాలయాలకు నిధులు సమకూర్చు పేరుతో ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.500 వసూలు చేశారని ఆరోపించారు. నగదు వసూలు చేసిన వ్యక్తి ఎవరిని ఆరా తీయగా ఆ గ్రామానికి చెందిన సాతా ప్రసాద్ అని చెప్పడంతో అక్కడే ఉన్న అతడ్ని అదుపులోకి తీసుకున్న ఎస్ఐ స్టేషన్‌కు తరలించారు. వివాదాలు లేకుండా ఇసుక రవాణా చేసుకోవాలని చెప్పి వివాదాన్ని పరిష్కరించారు.


కొల్లూరు లాకు సెంటర్‌లో ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా అడ్డుకోవడంతో స్తంభించిన ట్రాఫిక్

నదిలోకి వెళ్లకుండా గండ్లు ఏర్పాటు

పెసర్లంక అరవింద వారధి వద్ద నదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా గ్రామస్తులు గండ్లు ఏర్పాటు చేశారు. తమ పట్టా భూముల్లో ఇతరులు ఇసుక తరలించకుండా ఉండేందుకు గండ్లు ఏర్పాటు చేశామని, తాము కూడా ఇకపై ఇసుక రవాణా చేయమని ఎస్ఐకు తెలిపారు. మండల పరిధిలోని చిలుమూరు, జువ్వలపాలెం కాకులడొంక వద్ద ఇసుక రవాణాను నిలువరించేందుకు ఆయా గ్రామాలకు చెందిన రైతులు గండ్లు ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తుంది.

తగ్గిన ధరలు

ఎడ్ల బండ్లతో పాటు ట్రాక్టర్ల ద్వారా కూడా స్థానిక అవసరాలకు ఇసుకను తీసుకు వెళ్లవచ్చన్న ప్రభుత్వ ప్రకటనతో ఇసుక ధరలు తగ్గాయి. గాజుల్లంక, పెసర్లంక, ఈపూరు, చిలుమూరు, ఈపూరులంక, జువ్వలపాలెం తదితర నదీ పరివాహక గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరిగింది. దీంతో నిన్న మొన్నటి వరకు ట్రాక్టర్ ఇసుక దూరబారాన్ని బట్టి రూ.8 వేలు పలకగా, శనివారం ఆ ధర సగానికి తగ్గిపోయింది. చెరుకుపల్లి, తెనాలి, ప్రాంతాల్లో ఇసుక రూ.3 వేలు నుంచి రూ.4500లకు సరఫరా చేశారు.

పేదలపై ఫీజుల పిడుగు

- విద్యా హక్కు చట్టం ప్రవేశాలకు బ్రేక్
- ప్రైవేటు పాఠశాలలకు అనుకూలంగా తీర్పు
- ఫీజులు చెల్లించాలని యాజమాన్యాల ఒత్తిడి
- ఆందోళనలో తల్లిదండ్రులు.. స్పష్టత ఇవ్వని విద్యాశాఖ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1500పైగా ఆర్టీఈ విద్యార్థులు

గుంటూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నచందంగా తయారైంది. ఇప్పటికే విద్యా సంవత్సరం సగం గడిచింది. ఈ సమయంలో ఆర్టీఈ ప్రవేశాలపై ప్రైవేటు విద్యా సంస్థలకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో 25 శాతం సీట్లకు సంబంధించి గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 24ను ఇటీవల హైకోర్టు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నాయి. న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు వచ్చి రెండు రోజులు కాకముందే ప్రైవేటు యాజమాన్యాలు తమ ఫీజులపై జులుం ప్రదర్శిస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలలో విద్యా హక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు పొందిన 1500 మందికిపైగా విద్యార్థుల పరిస్థితి ఏమిటనేది తెలియడం లేదు. వీరిలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలే ఎక్కువగా ఉన్నారు. మరింత ఆందోళన కరమైన విషయం ఏమి టంటే హెచ్ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలు కూడా వీరిలో ఉన్నారు. ఆయా వర్గాలు వేలకువేలు ఫీజులు చెల్లించుకోలేరు. అయినా విద్యాహక్కు చట్టం ప్రకారం ఆయా వర్గాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. ఆ చట్టాన్ని కోర్టు రద్దు చేయడంతో పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకు వస్తున్నాయి. అంతంత ఫీజులు కట్టే స్థితిలో చాలామంది తల్లిదండ్రులు లేరు. ఫీజులు కట్టకపోతే అడ్మిషన్లు రద్దు చేస్తామని యాజమాన్యాలు బెదిరిస్తున్నాయి. విద్యా సంవత్సరం సగంలో పిల్లల్ని వేరే పాఠశా లలో చేర్పించే అవకాశం లేదు. దీంతో ఏమి చేయాలో పాలుపోక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఫీజులపై యాజమా న్యాల ఒత్తిళ్లు.. తల్లిదండ్రులు ఈ విషయంలో ఆందోళనలో ఉన్నా విద్యా శాఖ మౌనంగా ఉంది. విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల్ని చేర్పించే విషయంలో విద్యాశాఖ అనేకసార్లు ప్రకటనలు విడుదల చేసింది. ఈ ప్రకారం పలు కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థుల్ని అధికారులు చేర్పించారు. తాజాగా జీవో రద్దు కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నా విద్యాశాఖ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. యాజమా న్యాలు కోరినట్లు ఇప్పటికిప్పుడు వేలాది రూపాయల ఫీజులు చెల్లించాలంటే తమవల్లకాదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆర్టీ ఈ కింది చేరిన విద్యార్థులకు ఆయా పాఠశాలలను బట్టి రూ.25 వేల నుంచి రూ.35 వేలు ఫీజులు నిర్దేశించాయి. తొలి విడత దీపావళిలోపు రూ.10 వేలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఇప్పటికే తల్లిదండ్రుల్ని వ్యక్తిగతంగా పాఠశాలలకు పిలిచి ఫీజులపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు సమాచారం. నాటి వైసీపీ ప్రభుత్వం కనీసం విద్యాసంస్థల యాజమాన్యాలతో సమీక్ష కూడా నిర్వహించకుండా ఈ జీవోను తీసుకువచ్చింది. దీంతో కొన్ని పాఠశాలల యాజమాన్యాలు యునైటెడ్ ప్రైవేటు ఎడ్యుకేషనల్ ఇని స్టిట్యూషన్స్ ఫెడరేషన్(యూపీఈఐఎఫ్)గా ఏర్పడి న్యాయస్థానా న్ని ఆశ్రయించారు. తాజాగా న్యాయస్థానం ప్రైవేటు స్కూల్స్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఫలితంగా ఆర్టీఈ ద్వారా చేరిన పేద కుటుంబాల పిల్లలపై పిడుగు ప డినట్లు అయింది.



అమరావతి రైలుకు భూసేకరణ

- కార్యకలాపాలకి రైల్వే శాఖ టెండర్ నోటిఫికేషన్
- రూ.76.68 లక్షల పనిని ఏజెన్సీకి కేటాయించేందుకు నిర్ణయం

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి నూతన రైలుమార్గాన్ని సాధ్యమైనంత త్వరగా నిర్మించాలని రైల్వే శాఖ భావిస్తున్నది. భూసేకరణ ప్రక్రియని సులభతరం చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా రూ.76 లక్షల 68 వేల 373కి టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 29న బిడ్డింగ్ ప్రారంభించి నవంబరు 12న ముగించి ఏజెన్సీని ఖరారు చేయనుంది. ఎర్రుపాలెం - నంబూరు వయా అమరావతి 56.53 కిలోమీటర్ల పొడవునా రైలుమార్గాన్ని రాబోయే మూడు నాలుగేళ్లలోనే పూర్తి చేయాలని భావిస్తున్నది. ఇప్పటికే భూసేకరణ ఏ గ్రామాల్లో చేపట్టాలనే వివరాలను యంత్రాంగానికి నివేదించింది. సాదారణంగా రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ కాంపిటెంట్ అథారిటీగా స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారికి బాధ్యతలు కేటాయిస్తారు. అయితే అమరావతి నూతన రైలుమార్గం ప్రాజెక్టు ఎంతో ప్రాధాన్యం కలిగినది కావడంతో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏబీ తేజకు కాంపిటెంట్ అథారిటీ బాధ్యతలను ఇటీవలే కేటాయించారు. సర్వే నెంబర్ల వారీగా భూముల సేకరణ కోసం ప్రస్తుతం రికార్డువర్కు జరుగుతున్నది. ఈ ప్రాజెక్టు కోసం ఇటు గుంటూరు, కృష్ణానదికి అవతలి వైపున ఎన్‌టీఆర్ కృష్ణా, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలోనూ భూసేకరణ చేయాల్సి ఉన్నది. ఇందుకోసం ఫెసిలిటేషన్ బాధ్యతలను ఒక ఏజెన్సీకి అప్పగిస్తే భూసేకరణ ప్రక్రియ సులభతరంగా రెవెన్యూవర్గాలు పూర్తి చేయగలవన్న అభిప్రాయాన్ని రైల్వేవర్గాలు వ్యక్తపరుస్తున్నాయి. ప్రస్తుతానికి రైల్వే శాఖ సింగిల్ లేన్ మార్గాన్ని నిర్మించనున్నప్పటికీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రెండు వరసల మార్గానికి భూమి ఎంతైతే అవసరం అవుతుందో అంత విస్తీర్ణంలో భూసేకరణ చేపడుతుందని తెలిపాయి.

విజయవాడకు బైపాసు మార్గంగా..

ఎర్రుపాలెం - అమరావతి రాజధాని - నంబూరు రైలుమార్గం విజయవాడ జంక్షన్‌కు బైపాసు లైన్‌గా ఉపయోగపడనుంది. ప్రస్తుతం విజయవాడ జంక్షన్ రద్దీగా మారిన దృష్ట్యా సికింద్రాబాద్, బోపాల్ వైపు నుంచి వచ్చే రైళ్లు ఈ మార్గం మీదగా నంబూరుకు మళ్లించి అక్కడి నుంచి న్యూగుంటూరు మీదగా తెనాలికి చేర్చి ఆ తర్వాత మెయిన్‌లైన్‌లోకి తీసుకెళ్లొచ్చు. మరోవైపు గుంటూరు - నంద్యాల మీదగా ఒకమార్గం రేణిగుంటకు చేర్చవచ్చు.



కొమ్మమూరు కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతు

తెనాలి రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొమ్మమూరు కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతైన ఘటన శనివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు కేవీసీ కాలనీకి చెందిన గుంజి రవీంద్ర (20) ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మండలంలోని సంగంజాగర్లమూడి శ్రీ సంగమేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం తన ఐదుగురు స్నేహితులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో ఆలయం సమీపంలో ప్రవహిస్తున్న కొమ్మమూరు కాలువలోకి దిగి ప్రమాదవశాత్తూ అందులోపడిపోయాడు. అతడి ఆచూకీ కోసం స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి వచ్చి ఫైర్ అధికారులతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లి కాలువ వద్దకు వచ్చి కుమారుడి కోసం రోదిస్తున్న తీరు చూపరులను కంటతడిపెట్టించింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు.

రూ.1.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

- 'పల్లె పండుగ'తో అభివృద్ధి
- అన్నవరం, హనుమాన్‌పాలెం, తూములూరు, సిరిపురం, అత్తోటలో మంత్రి నాదెండ్ల శంకుస్థాపన

కొల్లిపర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆలోచనలతో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 13 వేల 362 పంచాయతీల్లో 4 వేల 500 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేపట్టడం చాలా గొప్ప విషయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండల పరిధిలోని అన్నవరం, హనుమాన్‌పాలెం, తూములూరు, సిరిపురం, అత్తోట గ్రామాల్లో శనివారం రూ.కోటి 30లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెల్లో అభివృద్ధి బాటలు వేసిందని, దశల వారీగా గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కొల్లిపర మండలంలోని గ్రామాల్లో రూ 2. కోట్ల 50లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ప్రజలకు ఎక్కువగా


సిరిపురంలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి మనోహర్

ఉపయోగపడే విధంగా రోడ్లు, డ్రైయిన్‌లు, రక్షిత మంచి నీటిసౌకర్యం కల్పించే విధంగా మంచి ప్రణాళికతో ముందుకు వెళతున్నామన్నారు. ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటుకు తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఇక్కడే ఉపాధి కల్పించే విధంగా తగిన చర్యలు చేపడతామన్నారు. యువతకు ఎక్కువగా ఉద్యోగాలు ఇచ్చేలా పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. మన సంస్కృతిని, పల్లెటూరుల వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొల్లిపర మండలంలోని రైతులు వాణిజ్య పంటలు ఎక్కువగా పండిస్తారని, రాబోయే రోజుల్లో అగ్రికల్చర్ హబ్‌గా ఏర్పాటుకు తగిన కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, పీఆర్‌ఏఈ ఎ.సాంబిరెడ్డి, కూటమి నాయకులు ఎ.నారాయణరెడ్డి, ఎం.వెంకయ్య, పి.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, డి.నరసయ్య, వై.వెంకయ్యనాయుడు, డి.ఏడుకొండలు, వై.పూర్ణచంద్రరావు, ఏటీఎం శ్రీను, వై.వెంకటరమణ పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

గ్రామాల సమగ్రాభివృద్ధికి 'పల్లె పండుగ'

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నకరికల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పల్లె పండుగ నిర్వహిస్తోందని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు అన్నారు. అడ్డ రోడ్డు, నకరికల్లు గ్రామాల్లోని సీసీ రోడ్లకు శనివారం ఆయన భూమి పూజ చేశారు. అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఒక దివ్యాంగుడు, ఇద్దరు మహిళలు తమ పింఛన్ల కోసం ఎంపీకి అభ్యర్థించగా వాటిని మంజూరు చేసే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జీ కాశయ్యను ఆదేశించారు. నకరికల్లులో ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరగా అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు తెలిపారు. రైతుల కోసం తీసుకు వచ్చిన ఇండో ఇజ్రాయల్ ప్రాజెక్టును సెంట్రాఫ్ ఎక్సలెన్స్ పనులను ప్రారంభించే విధంగా తగు చర్యలు తీసుకుంటా మన్నారు. నడికూడి, శ్రీ కాళహస్తి రైల్వే లైన్ మార్గంలో ప్యాసింజర్ రైళ్ళు నడిపేలా చూడాలని కోరడంతో స బంధిత అధికారులతో మాట్లాడతానని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు సురేష్‌లు, తస్లిమా, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.శౌరయ్య, ఎంపీపీ ఎం.అను రాధ, జెడ్పీటీసీ హరీష్, ఎంపీడీవో జీ కాశయ్య, తహసీల్దార్ కే పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.


కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పరిష్కారానికి లోకేశ్ చొరవ చూపాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు కార్మికుల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేశ్ చొరవ చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె .రామకృష్ణ అన్నారు. శనివారం సాయంత్రం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సిమెంటు కంపెనీ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1993లో ఏసీసీ యాజమాన్యం, సిమెంటు ఫ్యాక్టరీని అక్రమలాకౌట్ చేసిందని చెప్పారు. గత 40 ఏళ్లుగా నష్టపరిహారం చెల్లించాలంటూ కార్మికులు ఆందోళన చేస్తున్నా ఫ్యాక్టరీ యాజమాన్యం గానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కూడా కార్మికులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిమెంటు ఫ్యాక్టరీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఇన్నేళ్లుగా ప్రభుత్వాలు మారినా కార్మికుల సమస్యల పరిష్కారం కాలేదన్నారు. సీఎం చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను కలిసి కార్మికుల సమస్యను వివరిస్తామని పరిష్కరించే విధంగా ఒత్తిడి తీసుకొస్తామని, కార్మికులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని రామకృష్ణ హామీ ఇచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా నేతలు జంగాల అజయ్‌కుమార్, చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, తుడిమిల్ల వెంకటయ్య, సీపీఎం నేతలు బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, సిమెంటు ఫ్యాక్టరీ యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

ఏపీ లా సెట్ స్పెషల్ కేటగిరీల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

పెదకాకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని న్యాయ శాస్త్ర కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ లా సెట్-2024 సంబంధించి ప్రవేశాలలో భాగంగా స్పెషల్ కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం పూర్తయింది. ఆన్‌లైన్ ఆన్లైన్ హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. బ్రహ్మాజీరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఎన్ సీసీ అభ్యర్థులు 126 మంది, సీఏపీ అభ్యర్థులు 12 మంది, పీహెచ్ అభ్యర్థులు 37 మంది, స్పోర్ట్స్ అభ్యర్థులు 40 మంది హాజరయ్యారని తెలి పారు. సర్టిఫికెట్ల పరిశీలనను ఏపీ లా సెట్ 2024 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ బి. సత్యనారాయణ పర్యవేక్షించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

అచ్చంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన గద్దం హనుమంతరావు(70) శనివారం మధ్యాహ్నం పిడుగుపడి మృతి చెందాడు. రుద్రవరం, ఆర్‌కేజీ పాలెం గ్రామాల మధ్య పశువులను మేపుతున్నాడు. ఈ క్రమంలో భారీ వర్షం కురవడం, పిడుగు పడటంతో హనుమంతరావు తలకు, శరీరం పై తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం గమనించిన సమీపంలోని వారు హనుమంతరావు బంధువులకు సమాచారం తెలియజేశారు. మృతదేహాన్ని రుద్రవరానికి తరలించారు. మృతుడి భార్య సీతా రావమ్మ గతంలో మృతి చెందారు. ఒక కుమా రుడు, కుమార్తె ఉన్నారు.


హనుమంతరావు

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

గుంటూరు సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతి డ్రోన్ సమ్మిట్-2024ను నిర్వహించనుంది. దీని ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు , రాష్ట్ర మంత్రులు మంగళగిరి సీకే కన్వె న్షన్‌కు రానున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేష్ కుమార్ సూచించారు. ఈ కార్య క్రమంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండి కె.దినేష్‌కుమార్,జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా పాల్గొన్నారు.

రోగులకు వైద్యం చేయండి.. రాజకీయాలు కాదు

- డీసీహెచ్ఎస్ ఎంఏ మజీదా బేగం
- ఈపూరు వైద్యాధికారి ఆత్మహత్యాయత్నంపై విచారణ


వైద్యులను విచారిస్తున్న డీసీహెచ్ఎస్‌ఓ మజీదా బేగం

ఈపూరు,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రోగులకు మానవత్వంతో వైద్యం చేయాలి కాని ఆసుపత్రిలో రాజకీయాలు చేయకూడదని గుంటూరు జిల్లా డీసీహెచ్ఎస్ ఎంఏ మజీదా బేగం అన్నారు. ఈపూరు సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కమలాకరరావు ఆత్మహత్యా యత్నం చేయడం, అందుకు ఆసుపత్రి సిబ్బందే కారణమని ఆయన చెప్పడంతో శనివారం విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులను,సిబ్బందిని డీసీ హెచ్ఎస్ విచారించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ముప్పై పడకల ఆసుపత్రి సిబ్బంది 38 మంది ఉం డగా, అందులో 8 మంది వైద్యులు ఉన్నారని, రోగులకు వైద్య సేవలు అందించాల్సిందిపోయి వాళ్లందరూ రాజకీయాలు చేస్తుండడం బాధాకరమని అన్నారు. ఆసు పత్రి ఇంచార్జికి రికార్డు వర్క్ చాలా ఉంటుందని, ఇన్‌చార్జిపై ఒత్తిడి పెంచడం మంచి పద్ధతి కాదని అన్నారు. టెక్నాలజీ పెరిగినప్పటికి దానికి అనుగుణంగా వారు పని చేయడంలేదని తెలుస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వా లని, ఆ అభిప్రాయాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఆసుపత్రికి కొత్త ఇన్‌చార్జిని నియమిస్తామని చెప్పారు. ముందుగా ఆసుపత్రిలోని అటెండెన్స్ రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. 28 మంది విధులలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆసుపత్రిలోని బెడ్స్, కాన్పుల గది, ఆపరేషన్ థియేటర్,ఎక్స్‌రే ప్లాంట్, రక్తపరీక్షల గదిని, ఆక్సిజన్ సిలిండర్లను పరిశీలించారు. అయితే, బెడ్స్ అన్నీ ఖాళీగా ఉండడం చూసి ఆమె ఆశ్చర్యపోయారు. ఆసుపత్రిలో ఇంతమంది వైద్యులు,సిబ్బంది ఉన్నారు. రోగులు లేకపోవడం చాలా బాధగా ఉందన్నారు. నెలకు ఎన్ని కాన్పులు అవుతున్నాయని స్టాఫ్ నర్సును అడగగా ఒక్కటేనని సమాధానమిచ్చారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నాలుగు మాత్రమే చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో రోగులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన డీసీహెచ్ఎస్‌ఓ అందరికి మెమోలు ఇచ్చేందుకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థిని సాదియాకు 4 బంగారు పతకాలు


సాదియాను అభినందిస్తున్న వీసీ సారధివర్మ తదితరులు

తాడేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4 నుండి 13వరకు సన్ సిటి సౌత్ ఆఫ్రికా దేశంలో జరిగిన కామన్ వెల్త్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్ జూని యర్ పోటీలలో కెఎల్‌యూ విద్యార్థిని షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పత కాలు కైవసం చేసుకుని రికార్డు సృష్టిం చిందని వీసీ జి.సారధివర్మ తెలిపారు. స్కాట్ 185 కిలోల బరువు పోటీలలో బంగారు పతకం, బెంచ్ ప్రెస్ 95 కేజీల బరువులో బంగారు పతకం, డెడ్ లిఫ్ట్ 180 కేజీల బరువులో బంగారు పతకం, ఓవరాల్ 460 కిలోల విభాగంలో మరో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువు తున్నసాదియాను వర్సిటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో ప్రోవీసీ డాక్టర్ ప్రసాద్, వెంకటరామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, సాదియా తండ్రి షేక్ సంధాని పాల్గొన్నారు.



రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం ఖాసిం తదితరులు

అండర్-14,17 చెస్ రాష్ట్ర జట్లు ఎంపిక

గుంటూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి గుంటూరు జిల్లాఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వబాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెస్ పోటీల్లో రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. అండర్-14 అండర్-17 బాల బాలికల జిల్లా స్థాయి చదరంగం పోటీలు శుక్రవారం ముగిశాయని, అనంతరం రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ ఖాసిం స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.రవి వెల్లడించారు.

అండర్-17 బాలుర విభాగంలో..

అర్జున్ ఆదిత్య రవి, (గుంటూరు), పీఎస్‌వీ యశ్వంత్ రాజ్ కుమార్ (గుంటూరు),ఏ చంద్ర మహేష్(మాచర్ల), ఐ.మోహిత్ వెంకట శ్రీ సాయి (మాచర్ల) ఆర్ భార్గవ్ శ్రీనివాస నాయక్ (మాచర్ల)

అండర్-17 బాలికల విభాగంలో..

ఎ.సాయి దివ్య (గుంటూరు), ఎం.నాగసరియా (అమరావతి),పి.దివ్య (కొలకలూరు), షేక్ నజీరా (ఆత్మకూరు), ఎం.మైథిలి (అమరావతి) తదితరులు ఎంపికయ్యారు.

అండర్- 14 బాలుర విభాగంలో..

కె.శాన్వి మౌజీ (మాచర్ల), ఎహెచ్ సూర్యనారాయణ(గుంటూరు), బి.ప్రజిత్ (గుంటూరు), ఆర్.లోకేష్ (పిడుగురాళ్ల) వై.యాజ్ఞన్ (గుంటూరు) ఎంపికయ్యారు.

అండర్-14 బాలికల విభాగంలో..

ఎం.తేజ అనూష (గుంటూరు), సిహెచ్ మేరీ అక్షయ (తెనాలి), బి.భావన (మిరియాల), సిహెచ్ లక్ష్మీచేతన (గుంటూరు) ఎం.మనస్వి, (గుంటూరు).

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	135, 145,155
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శ్రీమన్నారాయణ


శ్రీమన్నారాయణ

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బి.శ్రీమన్నారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన డిపో మేనేజర్ శ్రీనివాస్ రిటైర్డ్ కావటంతో పొన్నూరు డిపో మేనేజర్ అజిత్‌కు మారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ వచ్చారు. ప్రస్తుతం కనిగిరి డిపో మేనేజర్‌గా చేస్తున్న శ్రీమన్నారాయణ బదిలీపై బాపట్ల వచ్చారు. డిపో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు బోధపడేవిధంగా విద్యాబోధన చేయాలి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధపడే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. పిట్టలవానిపాలెం ఎస్టీ కాలనీలోని పాఠశాలను విద్యాశాఖాధికారి ఆయన సందర్శించి పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే మౌలికసదుపాయాలు గురించి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, ఎండీఎం నిర్వాహకులుపాల్గొన్నారు.

గుర్రం జాషువా సాహిత్యం మరువరానిది

రేపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కవి గుర్రం జాషువా సాహిత్యం మరువరానిదని, వారు రాసిన తెలుగు భాషపై పుస్తకాలు పలువురికి స్ఫూర్తి అని వైస్‌ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా శనివారం ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా కవిసాహిత్యం, సృజన పట్టణాశక్తి భాషావికాసం మరువరానిదన్నారు. నేటి సమాజానికి జాషువా సాహిత్యం అవసరమని, వారి రచనలు ప్రతి ఒక్కరూ చదివి వాటిలోని విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డి.అనిల్‌కుమార్, నరసయ్య, ఎం.దాసు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహం సామాజిక దురాచారం

బాపట్ల,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహం సామాజిక దురాచారమని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ జె.రాజాదెబోరా అన్నారు. యాక్సెస్ టూ జస్టిస్, సీఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో బాల్యవివాహరహిత భారతదేశం అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీలతో కలిసి నిర్వహించిన ఈ ర్యాలీకి రాజాదెబోరా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాల్యవివాహ నిరోధక చట్టం అమలకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బాపట్ల కొత్తబస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ బడుగు కిషోర్, బీసీపీవో పురుషోత్తం, రోజ్ ప్రసాద్, డాక్టర్ గుదే రాజారావు, నాగరాజు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

కొల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : చేతివృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టిముక్కల బాలాజీ పిలుపునిచ్చారు. భట్టిప్రోలులోని ఏఐటీయుసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ వాగ్దానాలతో పేదలను, చేతివృత్తిదారులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని 100 రోజులు గడిచినా అమలులోకి తీసుకురాలేదన్నారు. సమావేశంలో చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, ఏఐటీయుసీ నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాంచారమ్మతల్లికి కొలుపుల పూజలు

కర్లపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామంలో గ్రామదేవత నాంచారమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠను పురస్కరించుకొని అమ్మవారికి మూడు రోజుల కొలుపుల పూజలను గ్రామపెద్దలు శనివారం ప్రారంభించారు. మహాలక్ష్మి అమ్మవారికి సాంప్రదాయ బద్ధంగా పెద మంగయ్య కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మడసాని బాలాజి, అలపర్తి శ్రీనివాసరావు, ఇమడబత్తుని నరసయ్య, బండ్రెడ్డి సూరి, మాడసాని శివనాగేశ్వరరావు, ఇమడబత్తుని రామ్మోహనరావు, సుధాకర్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

బాపట్లరూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి ఆధారాలు లేకుండా పూర్వీకుల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలనుకుంటున్న వ్యక్తిపై వెదుళ్ళపల్లి పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వెదుళ్ళపల్లి ఎస్ఐ పి.జనార్దనరావు తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో వేల్పూరి ధర్మారావు అనే వ్యక్తి పూర్వీకులు దానం చేసిన భూమి తనదేనంటూ గ్రామంలోని మంచినీటి చెరువు, గుడివైపు గ్రామస్థులు తిరగరాదంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేల్పూరి ధర్మారావుపై కేసు నమోదు చేయటం జరిగిందని ఎస్ఐ జనార్దనరావు తెలిపారు.

ద్విచక్రవాహాన్ని ఢీకొన్న ఆటో

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటన బాపట్ల పట్టణం శ్రీనివాసమహాల్ వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బాపట్ల పట్టణానికి చెందిన జాలా ప్రశాంత్‌కుమార్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొనటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రశాంత్‌కుమార్‌ను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేయటం జరిగిందని బాపట్ల టౌన్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

టిడ్కో గృహాల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

● వైసీపీ ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరిన వైనం


రుద్రవరం వద్ద పీఎం ఆవాస్ యోజన పథకం గృహాల్లో భారీగా పెరిగిన పిచ్చి మొక్కలు

రేపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల కోసం లబ్ధిదారులు వేలాది రూపాయల నగదును చెల్లిస్తే టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం కొంతమేర జరగ్గా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి టిడ్కో గృహాలను నిర్లక్ష్యంగా వదిలివేసింది. దీంతో గృహాల చుట్టుపక్కల ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానస్థితిలో ఉన్నాయి. కూలీనాలీ చేసుకుని సొంత ఇంటి కోసం ఒక్కో లబ్ధిదారుడు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. జగన్ ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేయలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు గృహాల కోసం డబ్బులు కట్టి అద్దె ఇళ్లలో తాము నివాసం ఉంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో టిడ్కో గృహాలు తిరిగి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని పట్టణ వాసులు పలువురు కోరుతున్నారు.

1373 గృహాలు మంజూరు

రేపల్లె మండలం అరవపల్లి పంచాయతీ శివారు గుంటూరువారి ఎస్సీ కాలనీ సమీపంలో, పట్టణానికి చెందిన 2వ వార్డులో 11 ఎకరాలలో భవన సముదాయంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద గత ప్రభుత్వం గృహ నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించగా నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నగర పంచాయతీలో 1373 పక్కా గృహాలు నిర్మాణానికి అనుమతిని అందజేసింది. అధికారులు ఇళ్ళులేని నిరుపేదలను గుర్తించి వారిందరితో లబ్ధిదారుల వాటా నగదును విడతల వారీగా చెల్లించుకున్నారు. ఇప్పటికే లబ్ధిదారులు రెండు కిస్తీలు చెక్కుల రూపంలో అప్పులు చేసి జమ చేశారు. ప్రస్తుతం పీఎంఏవై గృహాల నిర్మాణం మధ్యలోనే ఆగిపోవటంతో నూతన ఎన్డీయే ప్రభుత్వం తమకు టిడ్కో గృహాలను నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు.


ఇనుము తుప్పు పట్టి అధ్వానంగా తయారైన శ్లాబ్ లెవల్ గృహాలు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

● వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


భట్టిప్రోలులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పల్లె పండుగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. భట్టిప్రోలు విఠలేశ్వర్‌నగర్‌లో రూ.60 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్లలో జగన్ రాష్ట్రాన్ని పాతాళంలో తోసేశారన్నారు. మాఫియా ముఠాలు, డ్రగ్స్ డాన్‌లతో అరాచకం సృష్టించి రాష్ట్రంలో అభివృద్ధి జాడలు లేకుండా చేశారన్నారు. రాష్ట్రంలోని రహదారులన్ని దెబ్బతినిపోయిన పట్టించుకోకుండా సొంత ప్రయోజనాలు, పార్టీ నాయకుల ప్రయోజనాలే లక్ష్యంగా వైసీపీ పాలన సాగించిందన్నారు. గమనించిన ప్రజలు వైసీపీ పాలనకు చరమగీతం పాడి కూటమికి మద్దతు పలికారన్నారు. లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని పునః నిర్మించేందుకు ముఖ్యమంత్రి బాధ్యతతో పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లలితకుమారి, జడ్పీటీసీ ఉదయభాస్కరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, బీసీ సెల్ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు, టీడీపీ నాయకులు యర్రంశెట్టి కర్ణశ్రీనివాసరావు, యడ్ల జయశీలరావు, కనపర్తి సుందరరావు, ఎంపీడీవో ఎస్‌వి రమణ, ఈవోపీఆర్డీ ఊహారాణి, సర్పంచ్ రవి కిరణ్మయి, కార్యదర్శి శ్రీనివాసరావు, కుక్కల వెంకటేశ్వరరావు, ఇర్ఫాన్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

● అమృతలూరు, అక్టోబరు, 19 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని మూల్పూరులో రూ.30 లక్షల అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డు కూడా వేసిన పాపాన పోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకుసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మారుతీ శేషమాంబ, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బలుసులపాలెంలో సీసీ రహదారులకు శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

● రేపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి కోసం ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల నిధులను తీసుకువచ్చి రహదారులు అభివృద్ధి చేస్తున్నారని అనగాని శివప్రసాద్ అన్నారు. చెరుకుపల్లి మండలం బలుసులపాలెం గ్రామంలో పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సీసీరహదారులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 120 రోజుల్లోనే గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఒక్కొక్క పంచాయతీకి రూ.20 నుంచి రూ.25 లక్షలు నిధులు మంజూరు చేసి రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ఐదేళ్ళ జగన్‌పాలనలో గ్రామాలను నిర్వీర్యం చేశారని, అభివృద్ధి కోసం కోసం కేంద్రం నిధులు మంజూరు చేస్తే వాటిని పక్కదారి పట్టించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్‌సుభాని, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ మాజీ ఎంపీపీ మొహమాటం రాధాకృష్ణమూర్తి, కొనకాల రవికిరణ్, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈతేరు గ్రామంలో శనివారం పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎంపీటీసీ కాగిత నాగభూషణమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీశ్రేణులతో కలిసి గోపాలమిత్ర షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కూటమి పాలనలో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల దరికి చేరాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ దమ్ము మార్తమ్మ, గ్రామ కార్యదర్శి షణ్ముఖరావు, నాయకులు ఎం.సాంబశివరావు, ఎ.పౌల్, బి.హైమారావు, పి.అరుణ, టిఎలు కె.శ్యామ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.


క్రాపలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ

● కొల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ కార్యక్రమాన్ని రెండు గ్రామాల్లో నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని క్రాప, అనంతవరం గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మండల టీడీపీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, ఈవోపిఆర్‌డి సునీత, ఎపీవో లక్ష్మీ, పిఆర్‌ఏఈ చావా పాపారావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం పడమరబాపట్ల పంచాయతీ నాగేంద్రపురం, వైఎస్సార్‌నగర్ గ్రామంలో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లకు శనివారం భూమిపూజ కార్యక్రమాన్ని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి నిర్వహించారు. గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.20 లక్షల వ్యయంతో నాగేంద్రపురం, వైఎస్సార్‌నగర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్లకు శంకుస్థాపన చేయటం జరిగిందని బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, గ్రామపెద్దలు, పంచాయతీరాజ్ ఏఈ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

● చుండూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండూరు, ఆలపాడు, చినగాదెలవర్రులో ఒక్కొక్క గ్రామంలో రూ.20 లక్షల వంతున సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలో ఇన్‌చార్జి ఎంపీడీవో కుమారస్వామి, వివిఎస్‌కె ప్రసాద్, కుర్రి వెంకటరెడ్డి, ఏఈ మరియదాసు, సర్పంచ్ జొన్నకూటి ఉమాదేవి, దేవిరెడ్డి నాగేశ్వరరావు, సర్పంచ్ గాదె విజయలక్ష్మి, కేశం శ్రీనివాసరావు, బోడియ్య, దుంపల కృష్ణ, టి.శ్రీనివాస్, గ్రామ పంచాయతీల సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భవనంవారిపాలెం, కోమలి, పిట్టువారిపాలెం గ్రామపంచాయతీలలో శనివారం పల్లెపండుగ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. మండలస్థాయి అధికారులతో కలిసి ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, కూటమి నాయకులు ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొని నూతనంగా నిర్మించే సీసీ రోడ్లకు, తదితర కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. భవనంవారిపాలెం గ్రామపంచాయతీలో రూ.20 లక్షలు, కోమలి గ్రామపంచాయతీలో రూ.10 లక్షలు, పిట్టులవారిపాలెం గ్రామపంచాయతీలో రూ.13లక్షల20వేలతో పనులను ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో ఐ.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు మోదుగుల శివనాగేశ్వరి, శ్యామలానాగిరెడ్డి, ఏట్రి అశ్విని, ఎంపీటీసీలు దొంతిరెడ్డి సింధు, చెన్నుబోయన గంగయ్య, ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, సూపరింటెండెంట్ బి.మదుసూదనరెడ్డి, టీడీపీనాయకులు కలకోట చక్రధర్‌రెడ్డి, మోదుగుల సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ మాధవి, కార్యదర్శి వసుంధర లక్ష్మీ, ఆయా సచివాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం, నర్రవారిపాలెం పంచాయతీలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో శ్రీనివాసరావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కల శేషాద్రి, టీడీపీ నాయకులు నక్కల వెంకటస్వామి, మాజీ సర్పంచ్ చలపతిరెడ్డి, ఏపీవో మహేష్, సముద్రాలురెడ్డి ఉన్నారు.

ఎట్టకేలకు పైపులైన్‌కు మరమ్మతులు

● నేడు తాగునీటి సరఫరా పునరుద్ధరణ


పైపులైన్ మరమ్మతులు పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పగిలిన పైపులైన్‌కు మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేయించారు. కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డిలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జీబీసీ రోడ్డులోని మూర్తిరక్షణ నగర్ సమీపంలో మెయిన్ పంపింగ్ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి పంపింగ్ ప్రారంభించారు. శనివారం సాయంత్రం నుంచి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర ఉన్న ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లు, వివేకానందకాలనీ, చెంగల్రాయుడుతోటలోని ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లకు పంపింగ్ చేస్తున్నారు. రాత్రి నీటితో నింపి ఆదివారం ఉదయం తాగునీటిని సరఫరా చేస్తామని కమిషనర్ తెలిపారు.

పన్ను వసూళ్ళు వేగవంతం చేయాలి : కమిషనర్

బాపట్ల పట్టణంలోని 34వార్డుల పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్ళను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ అడ్మిన్, సెక్రటరీలు బాధ్యతగా పన్ను వసూళ్ళపై దృష్టి పెట్టాలన్నారు. ఎటువంటి అలసత్వం వహించిన సహించేదిలేదని హెచ్చరించారు. మొండిబకాయిలు గుర్తించి వాటి వసూళ్ళపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

యాప్ ద్వారా పూర్తి సమాచారం అందించాలి : సీడీపీవో

వేమూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల పని తీరును ఎప్పటికప్పుడు యాప్ ద్వారా తెలియజేయాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో శనివారం అమృతలూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీల ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్దిదారులకు ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్కరూ రికార్డులు తయారీ విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు విధానంలో అలసత్వం చూపవద్దని అర్హులైన వారందరికీ వాటిని అందించే పద్ధతులు పని చేయాలన్నారు. ఏ రోజుకు ఆ రోజు సరుకు నిల్వల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కేంద్రాలకు సకాలంలో హాజరుకావాలని, ఏమాత్రం అలసత్వం చూపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీపీసీ యోగలక్ష్మి ఈకేవైసీ విధానాన్ని వివరించారు. ఏసీడీపీవో విజయరాణి మాట్లాడుతూ కార్యకర్తలు విధివిధానాలు గుర్తించి పని చేయాలన్నారు. ఐదు మండలాల పరిధిలోని 308 కేంద్రాలకు చెందిన కార్యకర్తలు, సూపర్‌వైజర్లు హాజరయ్యారు.

గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

చుండూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్స్ విభాగాలు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మండల గ్రామాల్లో విద్యుత్ చౌర్యంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 62 మంది అధికారులు, 180 మంది సిబ్బంది 62 టీంలుగా ఏర్పడి చుండూరు, ఆలపాడు, కెఎన్‌పల్లి, వలివేరు, వేటపాలెం, చినపరిమి, యడ్లపల్లి, మోదుకూరులోని 5350 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 148 మందిని గుర్తించి రూ.6.20 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ సిహెచ్ వెంకటేశ్వరరావు, వి.చిరంజీవి తెలిపారు. తనిఖీల్లో డీఈఈ ఎస్ఎం ప్రసాద్, అశోక్‌కుమార్, ఏఈలు యు.శివశంకర్, ఎం.సతీష్‌కుమార్, ఆపరేషన్స్ ఏఈ డి.అర్జునరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.


ఫెసిలిటేషన్ సెంటర్ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పర్యవేక్షణ

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్
● కలెక్టరేట్‌లో ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ కేంద్రం ప్రారంభం

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో రూ.5 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన ఎంపీల్యాడ్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను శనివారం కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని చెప్పారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ప్రజలకు తెలియజేయాలన్నారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఎస్సీ జనాభా అధికంగా ఉండటంతో వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో శ్రీనివాసులు, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

బాలికాసదన్ తనిఖీ చేసిన జడ్జి

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అక్బర్‌పేటలో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికాసదన్, శిశు గృహాలను శనివారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి ఆకస్మిక తనిఖీ చేశారు. బాలికాసదన్‌లో పిల్లలకు అందుతున్న సదుపాయాలు పరిశీలించి పిల్లలతో మమేకమై మాట్లాడారు. మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ బోర్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.ఉమా, బాలికాసదన్ సూపరింటెండెంట్ సుబ్బలక్ష్మి, డీసీపీవో పి.పురుషోత్తం, బాలల సంరక్షణాధికారి కృష్ణ, సఖీ సీఏ ఉషా, సిబ్బంది పాల్గొన్నారు.


బాలికా సదన్‌లోని పిల్లలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి, స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ ఉమా తదితరులు

బీసీ వసతి గృహాలను తనిఖీ చేసిన జడ్జి

బాపట్ల,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మార్కెట్ కూడలిలో గల బీసీ వసతిగృహాలను అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రేణుకాలత సిబ్బందితో కలిసి శనివారం తనిఖీ చేశారు. వసతిగృహంలో విద్యార్థులకు అందుతున్న మెనూ గురించి తెలుసుకున్నారు. వసతులను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ డీవీఎస్ నాగరాజును వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుప్పట్లు, బెడ్‌షీట్‌లు వచ్చాయని జూన్ వరకు డైట్‌బిల్లులు, జూలై వరకు రెంట్‌బిల్లులు, విద్యుత్ బిల్లులు వచ్చినట్లు తెలిపారు. వసతి గృహం ద్వారా అందిస్తున్న కార్యక్రమాలను వివరించారు. అదేవిధంగా ఎస్సీ బాలికల వసతి గృహాన్ని కూడా సందర్శించారు. కార్యక్రమంలో న్యాయవాది కట్టా శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రేణుకాలత తదితరులు

స్వయం సహాయక సంఘాల సంక్షేమానికి కృషి : వేగేశన

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మెప్మా సీఎంఎం ఎస్.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శనివారం బాపట్ల పాతబస్టాండ్ కూడలిలో డ్వాక్రా ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని స్టాల్స్ ప్రారంభించి అక్కడ ఏర్పాటు చేసిన ఉత్పత్తులను పరిశీలించి తయారి గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, మండల మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, కూచిపూడి ఝాన్సీ, షేక్ నజ్మా, రమాదేవి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, సీవోలు విజయలక్ష్మి, మేరి, నవక్రాంత్, ఆర్పీలు పాల్గొన్నారు.


డ్వాక్రా ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


జమ్ములపాలెం హైస్కూల్‌లో జిల్లా స్థాయి సెలక్షన్స్

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హాకీ అండర్ 14, 17 బాలబాలికల ఉమ్మడి గుంటూరు జిల్లా సెలక్షన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు సెలక్షన్స్‌కు హాజరయ్యారు. అండర్ 17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు నవంబరు 3 నుంచి 5వరకు నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో గుంటూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అండర్-14 విభాగంలో ఎంపికైక క్రీడాకారులు నవంబరు 8 నుంచి 11 వరకు అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.రవి, బాపట్ల కార్యదర్శి ఎస్‌కే కరీముల్లా, డీఎస్‌డీవో పాల్‌కుమార్, ఎంఈవో ప్రసాద్, రమేష్, ప్రశాంత్, చందు, పిచ్చయ్య, గంగాధర్, భాస్కర్, ఆంజనేయులు, సాంబశివరావు, భాస్కర్, వాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కొనసాగాలి... వైద్యకళాశాల నిర్మించాలి : కోన రఘుపతి

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన బాపట్ల జిల్లాను కొనసాగించాలని, బాపట్ల వైద్యకళాశాల నిర్మాణ పనులను ఆపకుండా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రఘుపతి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు ఎవరు మొదలు పెట్టినా అధికారంలో ఉన్న వారు వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణం నిలిపివేయటం సరికాదన్నారు. మెడికల్ కళాశాల పూర్తి చేస్తే ఆసుపత్రి, నర్సింగ్‌కాలేజి వంటివి కూడా వస్తాయి కావున ఈప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, మండలపార్టీఅధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షులు జోగి రాజా, వడ్డిముక్కల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మగువ మేలుకో.. తెలుసుకో



మహిళలు..
సముద్రాన్ని సోదిస్తున్నారు.. అంతరిక్షాన్ని అందుకుంటున్నారు.. దేశ రక్షణ దిశలో అడుగులేస్తున్నారు.. కానీ వారి భద్రత ప్రశ్నార్థకంగా ఉంది. ఇంటి నుంచి బయటకు అడుగుపెడితే భయం. పగలు.. రాత్రీ.. అన్న తేడా లేకుండా ఏదో ఒక దారుణం. నేరాలు.. ఘోరాల్లో మహిళలు సమిధులుగా మారుతున్నారు. వయసు తారతమ్యాలు లేకుండానే మృగాలు వెంటాడుతున్నాయి.. వేధిస్తున్నాయి.. వధిస్తున్నాయి. రాజ్యాంగం ఎన్ని రక్షణ చట్టాలు కల్పించినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. నేతలు, అధికారులు వేదికలపై మహిళా రక్షణ గురించి చేస్తున్న ప్రకటనలు గాలిలో కలుస్తున్నాయి. అసలు మహిళలు తమకు రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాల గురించే తెలుసుకోవడంలేదు. ఇదే అవకాశంగా మహిళలు నానాటికీ అణిచివేతకు గురవుతున్నారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన చట్టాల గురించి ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం ప్రత్యేక కథనం..

- మహిళలకు రక్షణగా రాజ్యాంగం
- ప్రభుత్వం కల్పించిన చట్టాలు కోకొల్లలు
- అతివల అరచేతిలోనే టోల్ ఫ్రీ నెంబర్లు
- అవగాహన లేమితో తలెత్తుతున్న సమస్యలు
- మహిళలను చైతన్య పరచడంలో వెనకడుగే

గుంటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలపై పరంపరగా సాగుతున్న అత్యాచారాలు, హత్యలు, సామూహిక అఘాయిత్యాలు సమాజాన్ని కలవర పెడుతున్నాయి. సాంకేతికత, నాగరికత ఎంత విస్తరించినా మహిళలకు అన్యాయాలు.. వారిపై అత్యాచారాలు తగ్గడంలేదు. విద్యాలయం మొదలు పనిచేసే ప్రదేశం వరకూ అతివల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. మహిళల రక్షణకు రాజ్యాంగం ఎన్నో చట్టాలు రూపొందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మహిళల రక్షణ కోసం చట్టాలు తెస్తున్నాయి. వచ్చిన సమస్యల్లా తమకు అన్ని రక్షణలు ఉన్నాయని మహిళలు తెలుసుకోలేకపోవడమే. ఆ చట్టాలపై వారిలో అవగాహన లేకపోవడమే. తాజా పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంలో మహిళలు ప్రతి ఒక్కరూ.. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా తమకోసం రాజ్యాంగం కల్పించిన హక్కులు, తెచ్చిన చట్టాల గురించి తెలుసుకోవడం ఎంతో అవసరం. తద్వారా మహిళల రక్షణ వారి చేతుల్లోనే ఉంటుంది.



● స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం..

మహిళలను వేధించినా బలవన్మారణానికి పురికొల్పినా, హత్య చేసినా, అత్యాచారం చేసినా, అవమానపర్చినా, వారి హక్కులకు భంగం కలిగించేలా ప్రవర్తించినా భారత శిక్షా స్మృతి కింద నేరంగా పరిగణిస్తారు. మహిళలను అవమానిస్తూ మాటల రూపంలో, సంజ్ఞల రూపంలో, ఏదైనా ప్రదర్శన ద్వారా అసభ్యకర ప్రవర్తనతో కించపరిస్తే ఆ నేరానికి ఏడాది సాధారణజైలు, జరిమానా విధిస్తారు. నేర పూర్వక బలవంతం, సంజ్ఞల ద్వారా మహిళలను వేధిస్తే సెక్షను 354 (ఎ)ప్రకారం ఐదేళ్లకు తగ్గకుండా ఏడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా.

● సభ్యత - నైతిక నియమాల ఉల్లంఘనకు..

బహిరంగ ప్రదేశంలో అసభ్యకర పాటలు పాడటం, మరేదైనా అసభ్యకర చర్యలు చేయడం సెక్షన్ 294 ప్రకారం నేరం. ఇందుకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా. బాల, బాలికలకు అసభ్యకర సాహిత్యం, వస్తు సామగ్రి వంటివి విక్రయించడం తీవ్ర నేరంగా సెక్షన్ 293 ప్రకటించింది. ఈ నేరం కింద మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా తప్పదు.

● అత్యాచారం, ఆ తరహా నేరాలకు..

హింసా ప్రవృత్తితో స్త్రీ ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక అపచారం అత్యాచార నేరంగా పరిగణిస్తారు. సెక్షన్ 376 'ఏ' నుంచి 'డీ' వరకు క్లాజులలో సందర్భం, తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తారు. సెక్షను 376(1) ప్రకారం ఏడేళ్లకు తగ్గకుండా పదేళ్ల వరకూ, ప్రత్యేక సందర్భాల్లో జీవితకాలం వరకు జైలుశిక్ష జరిమానా విధించే అవకాశం ఉంది. నిర్భయ చట్టం కింద కేసు నమోదై విచారణలో దోషులుగా తేలితే ఉరిశిక్ష విధించే అవకాశం ఉంది.

● మోసపూరితంగా నమ్మించి ఇష్టంలేని వివాహానికి ప్రయత్నిస్తే ఆ వ్యక్తికి సెక్షను 366 ప్రకారం పదేళ్ల జైలు, జరిమానా విధిస్తారు.

అరచేతిలోనే రక్షణ

మహిళలను సంరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రక్షణచర్యలు చేపడుతున్నాయి. సెల్‌ఫోన్ వచ్చిన తరువాత మహిళా రక్షణ అవకాశాలు మరింత పెరిగాయి. మహిళ తనకు ప్రమాదం ఎదురైనప్పుడు ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నెంబర్లకు 100, 112, 1091, 181 ఫోన్లు చేయవచ్చు. స్మార్ట్‌ఫోన్‌కు ఉండే పవర్‌బటన్‌ను మూడుసార్లు ఆపకుండా నొక్కితే ఎమర్జెన్సీ కాల్ 112కి కాల్ వెళుతుంది. కాకపోతే దీనిపై మహిళలకు అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు ఇంకా జరుగుతున్నాయి. దీనిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా వుంది.

ఐసీడీఎస్ కృషి నామమాత్రమే

మహిళలను చైతన్య పరచడంలో ప్రభుత్వం ఇంకా వెనకంజలోనే ఉంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అవి నామమాత్రంగానే ఉన్నాయి. గుంటూరు జిల్లాలో గడిచిన 8 నెలల్లో 360 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. వీటి ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పురుషుల అపసవ్య ప్రవర్తనపై చిన్నారులు, మహిళలకు అవగాహన కల్పించారు. అయితే ఇవి నామమాత్రమనే చెప్పాలి. రోజువారీ కార్యక్రమంగా అవగాహన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.

రాజ్యాంగం కల్పించిన హక్కులు

రాజ్యాంగం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు కల్పించింది. లింగ వివక్షతను నిషేధించింది. స్త్రీల గౌరవాన్ని కించపరిచే పని ఏదీ చేయకూడదనేది ప్రతి పౌరుడి ప్రాథమిక విధిగా ప్రకటించింది. మహిళలు, చిన్నారుల అక్రమ రవాణాను నివారించేందుకు 1958లో అక్రమరవాణా నిరోధక చట్టాన్ని అమలులోకి తెచ్చింది. రాష్ట్రప్రభుత్వం 1988లో దేవదాసీ వ్యవస్థ నిషేధచట్టాన్ని తెచ్చింది. స్త్రీ అసభ్య చిత్రీకరణ నిషేధ చట్టాన్ని 1986లో తెచ్చింది. 1984లో కుటుంబ న్యాయస్థానాల చట్టం, 2001లో జాతీయ ఉచిత న్యాయ సహాయ సేవాసంస్థ, 2004లో మహిళా న్యాయస్థానాలు ఏర్పాటుచేశారు. 2013లో నిర్భయ చట్టం తీసుకువచ్చారు. ఈ చట్టం ప్రకారం అత్యాచారానికి పాల్పడిన వారికి గరిష్ఠంగా ఉరి శిక్ష విధించే విధంగా చట్టాన్ని రూపొందించారు. నిర్భయ నింధితులను ఈ చట్టం కింద నింధితులను ఉరి తీశారు.

అవగాహనే శ్రీరామ రక్ష

మహిళల కోసం ప్రభుత్వం అనేక రక్షణలు కల్పించింది. ఐసీడీఎస్ ద్వారా నిరంతరాయంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయినా మహిళల్లో చట్టాలు, రక్షణలపై అవగాహనా లేమి కనిపిస్తోంది. అవగాహన పెంచుకుంటేనే మహిళలకు స్వీయ రక్షణ సాధ్యమవుతుంది. ప్రధానంగా చిన్నారులు మోసకారుల బారిన పడకుండా రక్షించుకోగలుగుతాం.

- పద్మావతి, ఐసీడీఎస్ పీడీ, గుంటూరు

అటకెక్కుతున్న అట్లతద్దె!

● గ్రామాల్లో కనుమరుగవుతున్న సాంప్రదాయ పండుగలు

బాపట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అట్లతద్దె పండుగ వచ్చిందంటే చాలు ప్రతి గ్రామంలో ఉయ్యాలలు ఏర్పాటు చేసి ఆడపడుచులు నోములు నోచుకొని వాయినాలు పంచేవారు. తెల్లవారుజాము నుంచే ఉయ్యాల ఏర్పాటు చేసిన ప్రాంతంలో మైకులు పెట్టి ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. పెద్దఎత్తున సందడి చేసేవారు. నాటి వేడుకలు నేడు కనిపించటంలేదు. గ్రామాలు మొత్తం కలియతిరిగితే ఎక్కడో ఒకచోట మాత్రమే ఉయ్యాల కనిపిస్తున్నది. దానిపై ఊగేవారు కేవలం కొద్ది మంది మాత్రమే ఉంటున్నారు. ఒకప్పుడు ఉయ్యాల దగ్గర గ్రామస్తులంతా వరుసగా నిలబడి ఒకరితర్వాత ఒకరు ఊగే వారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించటం లేదు. వేడుకలను కూడా మొక్కుబడిగా చేస్తున్నారు. భర్త ఆయురారోగ్యాలతో ఉండాలని, 11 మంది ముత్తయిదువులు చంద్రోదయ ఉమాగౌరి వ్రతం చేసి 11 మందికి వాయినాలు ఇస్తారు. అదేవిధంగా ఒక పోతురాజుకు కూడా వాయినం ఇచ్చేవారు. ఈసందడి ప్రతిగ్రామంలో కనిపించేది. ఇళ్ళు శుభ్రం చేసి ఇంటి ముందు ముగ్గులు వేసి వేడుకగా జరుపుకునే ఈ కార్యక్రమాలు కాలక్రమేణ అక్కడక్కడ మాత్రమే కనిపిస్తున్నాయి. ప్రజలు సోషల్‌మీడియాకు అలవాటుపడిపోయి నాటి సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిచూపటంలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇదేవిధంగా జరిగితే భవిష్యత్తు తరాలకు సాంప్రదాయక పండుగలు, వేడుకలు ఉండేవనే విషయం కూడా తెలియక పోవచ్చు. కావున సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.



పడమరబాపట్ల పంచాయతీ వైఎస్సార్ నగర్‌లో అట్లతద్దె సందర్భంగా ఏర్పాటు చేసిన ఉయ్యాల

ప్రకాశం బ్యారేజి వద్ద

పెరిగిన వరద ఉధృతి

● దిగువకు 77 వేల 750 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశంబ్యారేజి వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 84 వేల 297 క్యూసెక్కుల వరదనీరు శనివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 40గేట్లను 2అడుగులు, 30 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 77 వేల 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువలకు 4,028 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 2,519 క్యూసెక్కులు వదులుతున్నట్లు తెలిపారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు 12 క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల

మాచర్ల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ 12 క్రస్ట్ గేట్ల ద్వారా అధికారులు శనివారం నీటిని విడుదల చేశారు. 12 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 97,200 క్యూసెక్కులను దిగువకు విడుదలచేశారు. సాగర్ నీటిమట్టం 590 అడుగులు వుంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 4,940 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,173 ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,638, 12 క్రస్ట్ గేట్ల ద్వారా 97,200, ఎల్‌ఎల్‌సీ ద్వారా 400, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు మొత్తం అవుట్‌ఫ్లో వాటర్‌గా 1,40,151 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుండి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,40,151 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది.

స్టాండింగ్ కమిటీ సభ్యుల

నియామకం జరిగేనా ?

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవికాలం పూర్తయింది. ఇప్పటి వరకు మేయర్ మనోహర్‌నాయుడు అధ్యక్షుడిగా, మరో ఆరుగురు సభ్యులతో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఏర్పడింది. ప్రతి సంవత్సరం ఎన్నికల ద్వారా స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. వారు ఏడాది పాటు పదవిలో కొనసాగుతారు. ప్రతి ఏటా జరిగే ఈఎన్నికల్లో చైర్మన్ మేయర్ కొనసాగుతూ, సభ్యులు మారుతూ ఉంటారు. ఈ ఏడాది ఆగస్టు 6వ తేదీతో ప్రస్తుత స్టాండింగ్ కమిటీకి పదవికాలం పూర్తయింది. ఈకమిటీలో సభ్యులుగా కార్పొరేటర్ షేక్ మహమ్మద్, సంకూరు శ్రీనివాసరావు, కాంద్రగుంట గురువయ్య, శ్యామల వెంకటరమణాదేవి, మాలిబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేద్కర్‌లు ఈ పదవుల్లో కొనసాగారు. ఆగస్టు ఆరో తేది నుంచి వీరంతా మాజీలయ్యారు. అప్పటినుండి కొత్త కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. వాస్తవానికి నగరంలో రూ.50 లక్షల రూపాయల వర్క్ చేపట్టాలంటే స్టాండింగ్ కమిటీ ఆమోదం తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికను నిర్వహించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైలు హాల్టింగ్‌కు మోక్షమెప్పుడు ?

వేమూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు వేమూరులో నిలుపుదల చేయాలంటూ ఈ ప్రాంత ప్రజలు అనేక మార్లు మొరపెట్టుకున్నా ఫలితం కానరాకుంది. సికింద్రాబాద్-రేపల్లె వెళ్లే డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు గతంలో వేమూరులో హాల్ట్ ఉండేది. కరోనా సమయంలో కొన్ని రైళ్లు రద్దు చేసిన తర్వాత తిరిగి వేమూరులో రైలు పునరుద్దరణలో చేసిన కొన్ని చోట్ల హాల్ట్‌లు ఎత్తివేశారు. ఆ నేపథ్యంలో డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు వేమూరులో నిలుపుదల చేయకుండా తెనాలి, చినరావూరు, భట్టిప్రోలులో నిలుపుదల చేస్తున్నారు. వేమూరులో హాల్ట్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు రైల్వేశాఖ అధికారులకు అనేకమార్లు ఫిర్యాదు చేసిన ఫలితం కానరాకుంది. ఈ మధ్య కాలంలో బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తేన్నేటి కృష్ణప్రసాద్‌ను వేమూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కలిసి వినతులు అందజేశారు. అదే విధంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు అనేకమార్లు వినతులు అందించారు. నేటి వరకు డెల్టా రైలు వేమూరులో హాల్ట్ ఏర్పాటు చేయకపోవడం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పార్లమెంట్ సభ్యుడు కృష్ణప్రసాద్ డెల్టా రైలు వేమూరులో నిలుపుదల చేసే విదంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నాయి. ఇంత వరకు వేమూరులో డెల్టా రైలు నిలుపుదల కాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. తక్షణం ప్రజా ప్రతినిధులు రైల్వే అధికారులు స్పందించి డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలు వేమూరులో నిలుపుదలచేసేలా చర్యలు తీసుకోవాలని వేమూరు పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ తమిళనాడు



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను తమిళనాడు మహిళా జట్టుకు అందజేస్తున్న నిర్వాహకులు

పెదకాకాని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యునివర్సిటీ వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో తమిళనాడు రాష్ట్రం ఓవర్ ఆల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అలాగే బాలుర విభాగంలోనూ, బాలికల విభాగంలోనూ తమిళనాడు రాష్ట్రం అత్యధిక పాయింట్లు సాధించి రికార్డు సృష్టించారు. మూడు కేటగిరిలో తమిళనాడు మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. విజేతలకు పోటీల నిర్వాహక కార్యదర్శి ఎ. గౌతమ్ కిరణ్, ఏఎన్‌యూ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈసీ మెంబర్ ఏ హైమావతి, జాయింట్ సెక్రటరీ ఏ.వీ. రాఘవేంద్రరావు, తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ కె. సారంగపాణి, మాజీ ఇంటర్నేషనల్ అథ్లెట్ శ్రీనివాస్, అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ అఫీషియల్ శ్రీనివాసరావు, టెక్నికల్ కమిటీ చైర్మన్ ఎం. నారాయణరావు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే. మధుసూదన్‌రావు తదితరులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

గుంటూరు రేషన్ దొంగలు

నల్గొండలో దొరికారు

- 550 క్వింటాళ్ల పేదల బియ్యం స్వాధీనం
- పట్టుకున్న బియ్యం విలువ రూ. 18 లక్షలు ఉంటుందని అంచనా
- బాపట్లకు చెందిన సుధాకర్, కర్ణాటకకు చెందిన సలావుద్దీన్ అరెస్టు
- విషయం తెలుసుకొని మాఫియా నేత పరారీ

గుంటూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): రేషన్‌మాఫియా ఆగడాలు అరికట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో పట్టుదలతో ఉన్నప్పటికీ లారీల కొద్దీ రేషన్ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటుతూనే ఉన్నది. రెండు రోజుల క్రితం ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన రేషన్‌మాఫియా సేకరించిన బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సన్న బియ్యం రూపంలో ఆంధ్రప్రదేశ్ పోలీసుల కన్నుగప్పి సరిహద్దు దాటించినప్పటికీ నల్గొండ పోలీసులు, పౌర సరఫరాలశాఖ అధికారుల వలలో చిక్కారు. రెండు లారీల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని మాఫియాలో కీలకపాత్ర పోషిస్తున్న బాపట్ల పట్టణానికి చెందిన చీమకుర్తి సుధాకర్‌ను అరెస్టు చేశారు. అతనితో పాటు కర్ణాటకకు చెందిన లారీ డ్రైవర్ సలావుద్దీన్, మరో డ్రైవర్ భీమయ్యను అరెస్టు చేశారు. ఈ మాఫియాలో మరొక భాగస్వామి అయిన గుంటూరు పట్టణానికి చెందిన అశోక్ పరారయ్యాడు. వీరు ఈ విధంగా ప్రతి నెలా 10 నుంచి 12 లారీల పీడీఎస్ బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు దాటించి పక్క రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నట్లు నల్గొండ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలోనే గురువారం కేఏ 56, 2700 నెంబరు గల లారీలో తెలంగాణ వైపు తరలివెళుతున్న 245 క్వింటాళ్ళ బియ్యాన్ని పట్టుకున్నారు. అదే విధంగా జీజే 25 యూ 2727 నెంబరు గల మరో లారీలో తరలిస్తున్న 250 క్వింటాళ్ళ పీడీఎఫ్ బియ్యాన్ని పట్టుకోవటం జరిగింది. సుధాకర్ గత కొన్ని సంవత్సరాలుగా బాపట్లలోని తన రైస్ మిల్లు (శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర అయ్యప్ప ట్రేడర్స్)లో రైతుల నుంచి సేకరించిన వడ్లతో పాటు గుంటూరు, బాపట్ల, నరసరావుపేటల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన పీడీఎఫ్ రైస్‌ను రీ సైక్లింగ్ చేసి వాటిని సన్నబియ్యం వలె పాలిష్ చేసి 20 కేజీలు, 30 కేజీల ప్లాస్టిక్ సూపర్ బ్యాగ్స్‌లో పార్శిల్ చేసి వాటికి సంబంధించి నకిలీ బిల్లులు కూడా రూపొందించి ఈ దొంగ వ్యాపారం చేస్తున్నట్లు వెల్లడైంది. గుంటూరుకు చెందిన అశోక్ కూడా ఇందులో పాత్ర ధారి అని సుధాకర్ ద్వారా తెలుసుకున్న నల్గొండ పోలీసులు అతన్ని అరెస్టు చేసేందుకు గుంటూరుకు వచ్చినట్లు సమాచారం. అయితే అతను పరారీలో ఉన్నట్లు తెలుసుకొని వెనుతిరిగిపోయినట్లు తెలిసింది. వీటి విలువ రూ. 18 లక్షలకు పైగానేఉంటుందని నిర్ధారించారు. ఏపీ నుంచి ఇంత భారీ మొత్తంలో బియ్యం తరలిపోతుంటే పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది.

జిల్లా స్థాయిలో అధికారులకు మాఫియాతో బలమైన సంబంధాలు వున్న నేపథ్యంలో వారికి ఫిర్యాదు చేయడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడమే మేలనే పరిస్థితి ఏర్పడింది. అక్కడ కూడా పరిష్కారం కాకపోతే ఆయా శాఖల రాష్ట్ర అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు తప్ప వీరికి మాత్రం ఫిర్యాదులు చేయడం లేదు. ఈ పరిస్థితులను చక్క దిద్దడం కోసం విజిలెన్స్ శాఖ ప్రక్షాళన చేపట్టింది. పలువురు అధికారులను బదిలీ చేసింది. కానీ పరిస్థితిలో మార్పు లేదు. విజిలెన్స్ ఎస్పీ అడపాదడపా దాడులు చేస్తున్నారు తప్ప నిఘా విభాగం ఏమాత్రం గాడిలో పడలేదు. ఇంత పెద్ద మొత్తంలో బియ్యం తరలిపోతున్నా సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం విశేషం. తాజాగా ఒక కేసులో 80 బస్తాలు బియ్యం పట్టుకుని కేవలం 1100 కిలోల బియ్యమే దొరికినట్లు చూపారన్న విమర్శలు గుప్పుమంటుండడంతో మాఫియాతో అధికారుల సంబంధాలు ఉన్నాయన్న వాదనకు బలం చేకూరుతోంది.

రేషన్ బియ్యం ఎక్కడ దొరికినా మూలాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే..

గుంటూరుజిల్లా రేషన్ మాఫియా అక్రమాలు 'ఆంధ్రజ్యోతి' బయట పెట్టడం తో మాఫియా కొత్త భాగస్వాములతో వ్యవహారం నడుపుతోంది. గుంటూరు కాకాని రోడ్డులోని మిల్లు భాగోతం బయట పడడంతో జిల్లాలోని ఐదోమైలు సమీపంలోని ఒక మిల్లు, చేబ్రోలు, వట్టిచెరుకూరు, పేరేచర్ల, ఫిరంగిపురంలలోని మిల్లులకు రేషన్‌బియ్యాన్ని తెచ్చి సన్న బియ్యంగా మార్చి తరలిస్తున్నారు.



రేషన్‌మాఫియా అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న నల్గొండ పోలీసులు (ఫైల్)



వీరగల్లు శిల్పాన్ని పరిశీలిస్తున్న సతీష్‌బాబు

వెయ్యి సంవత్సరాల నాటి

విగ్రహం లభ్యం



మాచర్లటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):దుర్గి మండలం బుగ్గవాగు రిజర్వాయర్ ప్రాంతంలోని పిచ్చిమొక్కల మధ్య సుమారు వెయ్యి ఏళ్లనాటి వీరగల్లు విగ్రహాన్ని చరిత్ర పరిశోధకుడు పావులూరి సతీష్ బాబు గుర్తించారు. కుడిచేతిలో కత్తి, ఎడమ చేతిలో డాలు, చెవులకు పెద్ద కుండలాలు, మెడలో గొలుసులు, చేతులకు రుద్రాక్ష మాల ధరించి శత్రువుతో పోరాడుతున్నట్లు శిల్పం ఉందన్నారు. ఆనాటి ప్రజలు మృతి చెందిన వీరుల శిల్పాలను చెక్కి చెరువులు, బావులు, గ్రామ పొలిమేరలు, ఆలయాలవద్ద ప్రతిష్ఠించేవారని సతీష్‌బాబు తెలిపారు. అలనాటి వీరుల శిల్పాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సతీష్‌బాబువెంట ఉప్పుతోళ్ల రమేష్, కిరణ్‌లు ఉన్నారు.

అక్రమాలకు సహకారం

ఒంగోలు విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో భారీగా నిధులు దుర్వినియోగమ య్యాయి. గత ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నేతల రుణగోల్‌మాల్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలవెల్లువ, పొదుపు సంఘాలకు రుణాల పేరుతో భారీగా దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఎం చంద్రబాబునాయుడు, ఆ శాఖ మంత్రి, ఆప్కాబ్, నాబార్డుతో పాటు విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. విజిలెన్స్ ఏఎస్పీ స్వయంగా ఒంగోలులోని పీడీసీసీ బ్యాంకు కేంద్ర కార్యాలయానికి వెళ్లి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) ఈద కోటిరెడ్డిని కలిసి విచారణకు అవసరమైన ఫైళ్లను అందజేయాలని కోరినట్లు తెలిసింది. బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జేసీ గోపాలకృష్ణను కలిసి విజిలెన్స్ విచారణ విషయాన్ని తెలియజేసి ఆయన అనుమతితో సీఈవో విజిలెన్స్ విచారణకు ఫైళ్లను అందజేసినట్లు తెలిసింది.

నాయకుల సిఫార్సుల మేరకు

పీడీసీసీ బ్యాంకు గతంలో నాబార్డు నిబంధనల ప్రకారం పనిచేసేది. ప్రస్తుతం అది రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనల ప్రకారం పనిచేస్తుంది. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేస్తాయి. ఆ క్రమంలోనే పీడీసీసీ బ్యాంకు కూడా రుణాలు మంజూరు చేసి నిధులు విడుదల చేసింది. అయితే బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జీ కమిటీ(పీఐసీ)ల పదవీకాలంలో అప్పటి నాయకుల సిఫార్సుల మేరకు అక్రమంగా రుణాలు మంజూరు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన 2019 నుంచి 2024 వరకు జరిగిన అక్రమాల్లో సుమారు రూ.80కోట్లు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఆ కాలానికి సంబంధించి మంజూరు చేసిన రుణాలన్నింటిపై విచారణ జరిపి అక్రమాలను వెలికితీయాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

11 అంశాల్లో అక్రమాలు

పీడీసీసీ బ్యాంకు వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో 11 అంశాల్లో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొదటగా జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా ఇచ్చిన రుణాలు వాయిదా మీరిన బకాయిలుగా మారాయి. ఈ పథకం కింద పాడి రైతులకు గేదెలు కొనుగోలుకు, వాటి నిర్వహణకు ప్రకాశం కామధేను పథకం పేరుతో రైతులకు కనీసం రూ.30వేల నుంచి లక్షాన్నర వరకు రుణాలు ఇచ్చారు. కొందరికి వారు వారంరోజుల్లో పోసిన పాలను ప్రామాణికంగా తీసుకొని గేదెలకు రుణాలు ఇచ్చారు. అమూల్ డెయిరీకి వీరి ద్వారా పాలు సేకరించేవారు. అయితే ఆచరణలో జగనన్న పాల వెల్లువ పథకం తుస్సుమనడంతో గేదెల కొనుగోలుకు ఇచ్చిన రుణాల వసూలు కాలేదు. ఈ రుణాల మంజూరు, నిధుల విడుదలలో భారీగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి.

- ట్రాక్టర్ల కొనుగోలులో బినామీ రుణాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ రుణాల మంజూరులో అక్రమాలు జరిగాయి.
- జాయింట్ లయబులిటీ గ్రూపులు(జేఎల్‌బీ) గ్రూపులకు జగనన్న తోడు రుణాల మంజూరులో అక్రమాలు జరిగాయి.
- ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకొని వారు పనిచేయని కాలానికి కూడా జీతాలు చెల్లించారు
- జాయింట్ లయబిలిటీ గ్రూపులకు ఇతర రుణాలు మంజూరులో అక్రమాలు చోటు చేసుకున్నాయి
- స్వయం సహాయక గ్రూపులు డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరులో భారీగా అవినీతి జరిగింది. అద్దంకి బ్యాంకు శాఖలో ఒక బినామీ స్వయం సహాయక గ్రూపునకు రూ.15లక్షల రుణం మంజూరు చేసి భారీగా అవినీతికి పాల్పడిన విషయం వెలుగులోకి రావడంతో అక్కడి ఉద్యోగిని బ్యాంకు సీఈవో చార్జ్‌షీటు చేశారు. ఒంగోలు నగరంలో కూడా బినామీ గ్రూపులకు రుణాలు మంజూరు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.
- జగనన్న షిప్ ఆంధ్ర పథకం కింద రుణాలు మంజూరులో భారీ కుంభకోణాలు జరిగాయి.
- బ్యాంకులో వ్యక్తిగతంగా గృహ తనఖా రుణాలు మంజూరులో కూడా అక్రమాలు జరిగాయి.
- రైతులకు స్వల్పకాలిక, ధీర్ఘకాలిక రుణాల్లో భారీగా అవినీతి జరిగింది. బినామీలు కొందరికి కూడా ఈ రుణాలు మంజూరు చేశారు. కొన్ని బ్యాంకు శాఖల్లో రుణాలకు సంబంధించి బాండ్లు లేకుండా రుణాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.
- బ్యాంకు ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల్లో భారీగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
- బ్యాంకు శాఖల్లో రీ మోడలింగ్‌లో కూడా పెద్ద కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రికి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ అంశాలన్నింటిపై విజిలెన్స్ విచారణలో ఏమి తేలుతుందో వేచిచూడాల్సి ఉంది.

వీడని వాన

ఒంగోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వాయుగుండం ముప్పు తప్పినా జిల్లాను వర్షం వీడలేదు. శుక్ర, శనివారాల్లో చాలాచోట్ల ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అక్కడక్కడా భారీవర్షమే పడటంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు భారీవర్షాలు తెరపి ఇచ్చి ఎండలు రావడంతో పంట నష్టాలు వెలుగుచూస్తుండగా మళ్లీ జల్లులు పడుతుండటంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేసమయంలో జిల్లా అంతటా రోడ్లు ఛిద్రంగా మారాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా పారిశుధ్యం అధ్వానంగా మారగా సీజనల్ వ్యాధులు విజృంభించే పరిస్థితి కనిపిస్తోంది. కాగా జిల్లాలో ఈ వర్షాలకు దెబ్బతిన్న పంటలను శనివారం సాయంత్రం మంత్రి డాక్టర్ స్వామి పలుచోట్ల పరిశీలించారు.

సగటున 15.38 సెం.మీ నమోదు

జిల్లాలో ఈనెల 11 నుంచి తెరపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. తొలుత మూడు రోజులు సాధారణ వర్షాలు పడగా 14 నుంచి 17 వరకు వాయుగుండం ప్రభావంతో కురిశాయి. అలా ఆ వారంరోజుల్లో జిల్లాలో సగటున 15.38 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా సగం మండలాల్లో 20 నుంచి 34 సెం.మీ మేర కురిసింది. గురువారం ఉదయం వాయుగుండం తీరం దాటడంతో ముప్పు తప్పిందని అందరూ భావించారు. అయితే తిరిగి శుక్ర, శనివారాల్లో జిల్లావ్యాప్తంగా జల్లులు పడుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఒక మోస్తరు నుంచి భారీవర్షమే పడింది. శనివారం ఉదయం 8 గంటలకు గడిచిన 24గంటల్లో జిల్లాలో సగటున 9.10 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జరుగుమల్లి మండలంలో 40.60 మి.మీ కురియగా కేకే మిట్లలో 35.60, సింగరాయకొండ, బేస్తవారపేట, గిద్దలూరు, మార్కాపురం, పొదిలి, టంగుటూరు, కంభం, కొమరోలు, పెద్దారవీడు, వెలిగండ్ల తదితర మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. అలాగే శనివారం పగటిపూట కూడా చాలాచోట్ల భారీ వర్షం కురిసింది. ఉదయం 8 గంటల నుంచి 11 గంటలలోపు గరిష్ఠంగా సింగరాయకొండలో 46.4 మి.మీ, కురవగా కొత్తపట్నం 28.0, ఒంగోలు 24.4, జరుగుమల్లి 24.0 మి.మీ నమోదైంది.

సజ్జ పంటను పరిశీలించిన మంత్రి

వారం రోజులపాటు కురిసిన వర్షాలు తెరపి ఇచ్చి కాస్తంత ఎండ రావడంతో వర్షాలు వల్ల దెబ్బతిన్న పంట నష్టాలు వెలుగు చూస్తున్నాయి. జిల్లాలో ఇటీవల వర్షాలకు 17 మండలాల్లోని 89 గ్రామాల్లో 3,231 మంది రైతులకు చెందిన 3,749 హెక్టార్లలో సజ్జ, జొన్న, మినుము, అలసంద, వరి, పత్తితదితర పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. అయితే పంటనష్టాలు అంతకు నాలుగు రేట్లు అధికంగా ఉన్నట్లు తెలుస్తుండగా మరింత ఎండ వస్తే వాస్తవ నష్టాలు బయటపడే అవకాశం ఉంది. కాని తిరిగి జల్లులు పడుతుండటంతో అధికంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి డాక్టర్ స్వామి శనివారం పొదిలి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో దెబ్బతిన్న పంటలను కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జీ గొట్టిపాటి లక్ష్మిలతో కలిసి పరిశీలించారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

నిమ్జ్ ప్రాంతంలో భారీ పరిశ్రమ

- మాజీ కల్నల్ సారథ్యంలో పరిశీలనకు వచ్చిన బృందం
- అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ ఎమ్మెల్యే ఉగ్ర హామీ
- కనిగిరి ప్రాంతవాసుల్లో చిగురిస్తున్న ఆశ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కనిగిరి నియోజకవర్గంలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దృష్టిసారించారు. ముఖ్యంగా నేషనల్ ఇన్వెస్టిమెంట్ అండ్ మ్యాన్‌ఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్)కు కేటాయించిన స్థలంలో పరిశ్రమ ఏర్పాటుకు కొందరు ముందుకు రావటం విశేషం. వారికి అవసరమైన అనుమతులు ఇప్పించటంలోను, సౌకర్యాలు కల్పించటంలోను పూర్తి సహకారం ఉంటుందని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి వారికి హామీ ఇవ్వటంతో కనిగిరి నియోజకవర్గ ప్రజల్లో కూడా ఆశలు చిగురిస్తున్నాయి. శనివారం రిటైర్డ్ కల్నల్ జయరావు ఆధ్వర్యంలో వచ్చిన పారిశ్రామికవేత్తల బృందం నిమ్జ్‌కు కేటాయించిన ప్రాంతాన్ని, కనిగిరి ప్రాంతంలోను పర్యటించింది. పది సంవత్సరాల క్రితం కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. అయితే రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం ద్వారా ఆ ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారు. గత ప్రభుత్వంలో ఆ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. నియోజకవర్గంలో పామూరు, పీసీపల్లి, కందుకూరు నియోజవకర్గంలోని వలేటివారిపాలెం మండలాల పరిధిలో సుమారు 12వేల ఎకరాల భూమిని నిమ్జ్‌కు కేటాయించేందుకు నిర్ణయించారు. అందులో 2వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. మిగిలిన భూముల్లో ప్రయివేటు వ్యక్తులకు సంబంధించిన భూముల సేకరణకు నోటీసులు జారీ అయ్యాయి. అయితే గత ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వకపోవటంతో తదుపరి పనులు వేగంగా జరగలేదు. పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదు. రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పారిశ్రామికవేత్తలు మళ్లీ రాష్ట్రం వైపు దృష్టిసారించిన విషయం తెలిసిందే. నిమ్జ్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటూ కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పారిశ్రామికవేత్తలను కలవటం ప్రారంభించారు. కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్ ద్వారా రిటైర్డ్ కల్నల్ జయరావు బృందం ఈ వైపు దృష్టిసారించింది. డిఫెన్స్‌లో ఉన్నతస్థాయిలో పనిచేసి రిటైర్డ్ అయిన ఆయన ప్రస్తుతం కేంద్రంలో సలహాదారుడుగా ఉన్నారు. దేశంలో ప్రయివేటు సెక్టార్‌లో డిఫెన్స్ కారిడార్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం సహకరిస్తే ఏర్పాటుచేయాలని వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి చెప్పారు. అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని చంద్రబాబు సూచించటంతో స్థల అన్వేషణ ప్రారంభించారు. ఈ దశలో డాక్టర్ శివరాం ద్వారా వారిని పరిచయం చేసుకున్న డాక్టర్ ఉగ్ర నిమ్జ్ ప్రాంతంలో అనువైన స్థలం ఉందని చెప్పటంతో వారు శనివారం వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆరుగురు సభ్యుల బృందం కనిగిరి నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న భూములతోపాటు నిమ్జ్‌కు కేటాయించిన ప్రాంతాన్ని కూడా చూపించారు. పామూరు, పీసీపల్లి మండలాలకు మధ్య వలేటివారిపాలెం మండలపరిధి కూడా కలిసొచ్చే ప్రాంతాన్ని వారు ప్రత్యేకంగా పరిశీలించారు. సమీపంలో గ్రామాలు లేకుండా ఉంటే మంచిదని తెలిపారు. డిఫెన్స్ కారిడార్ అంటే కేవలం ఆయుధాల తయారీ పరిశ్రమే కాకుండా ఆయా స్థాయి ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే యూనివర్సిటీ కూడా వస్తుందని రిటైర్డ్ కల్నల్ జయరావు ఈ సందర్భంగా తెలిపారు. పెద్ద స్థాయి హెలికాప్టర్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుదారులు కూడా స్థలం కోసం అన్వేషిస్తున్నారని వారిని కూడా ఇక్కడే పరిశ్రమ ఏర్పాటుకు ప్రోత్సహిస్తామని తెలిపారు. మొత్తం పరిశీలన అనంతరం నీటి సమస్యను వారు ప్రధానంగా ప్రస్తావించగా మోపాడు రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే ఉగ్ర హామీ ఇచ్చి అందుకున్న అవకాశాలు కూడా చూపించారు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే పరిశ్రమ అయితే పూర్తిస్థాయిలో సహకరిస్తామని వారికి హామీ ఇచ్చారు. అన్ని రకాల అనుమతులను వెంటనే ఇప్పిస్తామని తెలిపారు. అందులోభాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమావేశం ఏర్పాటు చేయిస్తామని ప్రభుత్వపరంగా ఇచ్చే సహకారంపై మాట్లాడతామని చెప్పగా వారు అంగీకరించారు. రోజంతా నియోజకవర్గంలోనే పర్యటించిన ఆ బృందం శనివారం కావటంతో ఇటు మాలకొండ, అటు భైరవకోన దేవాలయాల సందర్శన కూడా చేశారు. డాక్టర్ ఉగ్రతో పాటు దివి శివరామ్ వారికి అనేక అంశాలపై వివరణ ఇచ్చారు.



నిమ్జ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జయరావు, ఎమ్మెల్యే డాక్టర్‌ఉగ్ర

ప్రతి రైతునూ ఆదుకుంటాం

- సీఎం మాట్లాడి పంట నష్టపరిహారం ఇస్తాం
- మంత్రి బాలవీరాంజనేయస్వామి

పొదిలి/తాళ్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాలకు పంటలు దెబ్బతిన్న ప్రతి రైతునూ ఆదుకుంటామని మంత్రి డోలాశ్రీబాల వీరాంజనేయ స్వామి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. పొదిలి, తాళ్లూరు మండలాల్లో మంత్రితోపాటు కలెక్టర్ అన్సారియా, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఉన్నారు. తాళ్లూరు మండలం రామభద్రాపురం వద్ద దెబ్బతిన్న జొన్నతోటను, మాధవరం వద్ద దెబ్బతిన్న గుమ్మడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వర్షాలకు జిల్లాలో 17 మండలాలు ప్రభావితమయ్యాయన్నారు. జిల్లాలో రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల మేర పంటలకు నష్టం వాటిలినట్టు జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్టు చెప్పారు. పొదిలి, మార్కాపురం, కనిగిరి, దర్శి, కొండపి ప్రాంతాల్లో సజ్జ, జొన్న, పొగాకు , అలసంద, ప్రత్తి, మినుము, వరి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఈక్రాప్ నమోదు చేయని రైతులకు కూడా పంట నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టామన్నారు. కౌలు చట్టం ద్వారా ప్రతి రైతుని ఆదుకుంటామన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 3749 హెక్టార్లలో 3231 మంది రైతులు నష్టపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు తయారుచేశారన్నారు. వాటితో పాటు ఉద్యాన పంటలు 561 హెక్టార్లలో 797 మంది రైతులు వేసిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వానికి పంటల నష్టం వివరాలను పంపినట్టు చెప్పారు. మరలా వర్షాలు కురుస్తున్నందున మంత్రి సూచనమేరకు దెబ్బతిన్న పంటల నష్టం అంచనాలను ప్రభుత్వానికి నివేదించి రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ఆర్‌డీవో లక్ష్మీ ప్రసన్న, వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తాళ్లూరు మండలం రామభద్రాపురంలో సజ్జకంకి గింజలకు మొలిచిన మొక్కలను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

- బైక్‌పై వస్తుండగా ఢీకొన్న గుర్తుతెలియని వాహనం
- ఘటనా స్థలంలోనే మృతి
- ఎస్పీ దామోదర్ నివాళి
- భార్య తొమ్మి దినెలల గర్భిణి

చీమకుర్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ఎంతో కష్టపడి తాను అనుకున్న ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించటంతో పాటు, సంఘ విద్రోహశక్తులను మట్టుబెట్టే అత్యంత రిస్క్‌తో కూడిన కీలకమైన బాధ్యతలో ఉన్న కానిస్టేబుల్ దూదేకుల మాబూసుబాని (28) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. చీమకుర్తి మండలం రెడ్డినగర్ వద్ద శనివారం ఈ ఘటన జరిగింది. మార్కాపురం సబ్‌డివిజన్‌లో మాబూసుబానీ తన విధులు ముగించుకొని బైక్‌పై హెడ్‌క్వార్టర్ ఒంగోలులో రిపోర్ట్ చేసే నిమిత్తం వస్తున్నారు. ఈక్రమంలో ఆయనను వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. కానిస్టేబుల్ హెల్మెట్ ధరించినా అది ఊడిపోవడం, తలకు బలమైన గాయం తగలడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సుబాని 2020 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. దోర్నాల మండలం చినగుడిపాడుకు గ్రామానికి చెందిన ఆయనకు వివాహం అయింది. భార్య తొమ్మిదినెలల గర్భిణీ. ఇది అందరి హృదయాలను కలచివేసింది. ఘటనా స్థలానికి వచ్చిన సీఐ సుబ్బారావు, సిబ్బంది విగతజీవిగా పడిఉన్న సుబానీని చూసి చలించిపోయారు. కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రిమ్స్‌లో ఎస్పీ నివాళి

ఒంగోలు క్రైం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ మాబూసుబాని మృతదేహన్ని ఎస్పీ ఏఆర్ దామోదర్ సందర్శించారు. శనివారం రాత్రి స్థానిక రిమ్స్‌లో ఉన్న ఆయన మృతదేహంపై పూలమాల ఉంచి ఎస్పీ ఘనంగా నివాళులర్పించారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్‌శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాబూసుబాని (ఫైల్)



నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

తవ్వేకొద్దీ వెలుగుచూస్తున్న అక్రమాలు

- మరో సర్కార్ దుకాణంలో రూ.9లక్షలు మాయం
- ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ ఆస్తులపై దృష్టి

ఒంగోలుక్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం శాఖలో చోటుచేసుకున్న అవినీతి బాగోతం బయటపడిన విషయం తెలిసిందే. తొలుత ఎలైట్ మాల్‌లో రూ.2.34 కోట్ల నిధులు గోల్‌మాల్ అయినట్లు నిర్ధారించిన అధికారులు రమణ వెరిఫికేషన్ అధికారిగా ఉన్న మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒంగోలులోని ఓ దుకాణంలో మరో రూ.9లక్షలు మాయం అయినట్లు తెలిసింది. దీంతో అక్కడ పనిచేసే సూపర్‌వైజర్ ద్వారా ఆ మొత్తాన్ని రికవరీ చేసినట్లు తెలిసింది. అదేక్రమంలో కానిస్టేబుల్ రమణ ఆస్తులపై అధికారులు దృష్టి సారించారు. ఎక్సైజ్ శాఖ నుంచి రవాణా, రిజిస్ట్రేషన్ శాఖలకు లేఖలు రాశారు. రమణకు సంబంధించిన ఆస్తులు, వాహనాలు ఎవరికి బదిలీ చేయకూడదని కోరారు. అదేవిధంగా బ్యాక్‌లలో ఉన్న నగదును ఫ్రీజ్ చేయాలని లేఖలు రాయనున్నట్లు తెలిసింది. అయితే ఇంతవరకు ఎక్సైజ్ అధికారులు కానిస్టేబుల్ రమణపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ప్రస్తుతం ఎలైట్ మాల్స్‌లో పనిచేసే సిబ్బందిని విచారణ చేసి రాత్రికి ఇంటికి పంపిస్తున్నారు.

చెడ్డీగ్యాంగ్ కలవరం



కళాశాలలో గేట్లు పగులకొడుతున్న చెడ్డీగ్యాంగ్

ఒంగోలు క్రైం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): చెడ్డీగ్యాంగ్ చొరబాటు విషయం నగరంలో కలవరం పుట్టిస్తోంది. పోలీసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. రెండు రోజుల క్రితం నగర శివారు ప్రాంతంలో ఉన్న ట్రిపుల్ ఐటీలో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసిన అనే విషయం సీసీ పుటేజీలో వెలుగుచూసింది. దీంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. రావ్ అండ్ నాయుడు కాలేజీలో ట్రిపుల్ ఐటీ నడుస్తుంది. అక్కడ రెండు వేలమంది విద్యార్థులు ఉంటున్నారు దొంగలు కాలేజీలోకి చొరబడి దొంగతనం చేయడానికి విశ్వప్రయత్నం చేశారు. అక్కడ ఏమి వారికి దొరకలేదు. అక్కడి నుంచి రైలు పట్టాలు వెంట నడుచుకుంటూ రాంనగర్ 8 లైన్‌లో ఆలూరి నర్సింగ్ కళాశాలలోకి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ కళాశాల కార్యాలయంలో రూ.లక్ష నగదు అపహరించుకెళ్లారు. అయితే ట్రిపుల్ ఐటీ కళాశాలలో మొదటి అంతస్తులో బాలికల వసతిగృహం ఉంది. అదేవిధంగా నర్సింగ్ కళాశాలలో అంతా బాలికలే ఉంటారు. దొంగలు కేవలం కళాశాల ఆఫీస్ గదులలో మాత్రమే దొంగతనానికి పాల్పడ్డారు. ఈ గ్యాంగ్‌లో ఐదుగురు సభ్యులు ఉన్నారు. వారు మారణ ఆయుధాలతో తిరుగుతుంటారు. అదేవిధంగా శివారు ప్రాంతాలలో ఉన్న పెద్దపెద్ద భవనాలను ఎంపిక చేసుకుని చోరీలు చేశారు. అయితే ఈ ముఠా చోరీలకు పాల్పడే సమయంలో జనసంచారం ఉంటే వారిపై దాడులు చేయడానికి కూడా వెనుకాడరు.

గస్తీ ముమ్మరం చేశాం: డీఎస్పీ

చెడ్డీగ్యాంగ్ కదలికలు ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజుల క్రితం ఒంగోలు ట్రిపుల్ ఐటీ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో చోరీలకు పాల్పడినట్లు సీసీ పుటేజీ లభ్యమైందని చెప్పారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు గస్తీ ముమ్మరం చేశామన్నారు. అదేవిధంగా బ్లూకోట్స్, రక్షక్ వ్యవస్థను పటిష్ఠ పరిచామని తెలిపారు. ఏడు బ్లూకోట్స్ బృందాలలో ఒక్కో వాహనంపై ఇరువురు ఉండే విధంగా రక్షక్ వాహనంలో డ్రైవర్‌తోపాటుగా ముగ్గురు సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. పోలీసు బీట్ వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. ప్రతి కానిస్టేబుల్ వాహనానికి సైరన్ ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. నిఘా పటిష్ట పరిచామని వివరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు. అనుమానితులు ఉంటే వెంటనే సమీప పోలీసు స్టేషన్‌లో, 112కు సమాచారం ఇవ్వాలని కోరారు.



కొత్తకోట వాగులో ప్రవహిస్తున్న వరదనీరు

ఆగని వాన

- ఉధృతంగా ప్రవహిస్తున్న కొత్తకోట వాగు
- నిలిచిన రాకపోకలు

నాగులుప్పలపాడు అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు వరదనీటితో చెరువులను తలపిస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి మండలంలో మళ్లీ కుండపోత వర్షం కురవడంతో అంతా జలమయంగా మారింది. చదలవాడ రామన్న చెరువుకు ఇటీవల గండిపడిన ప్రాంతం వద్ద నుంచి 216 జాతీయ రహదారి పైకి వరదనీరు చేరింది. కొత్తకోట వాగులో సైతం వరదనీరు చేరడంతో నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. ముప్పాళ్ల, ఈదుమూడి, మాచవరం, ఉప్పుగుండూరు గ్రామాల్లోని పొలాల్లో మరింత వరద నీరు చేరి కనుచూపు మేర అంతా జలమయంగా మారింది. మరో రెండు రోజుల తర్వాత మరో అల్పపీడనం ఏర్పడవచ్చన్న వాతావరణశాఖ సూచనలతో రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఈనెల 21,22వ తేదీల్లో కేంద్ర ఆరోగ్య బృందం తనిఖీలు చేస్తుందని, అందువల్ల అన్ని రికార్డులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో శనివారం ప్రోగ్రామ్ అధికారుల సమావేశంలో ఆయన పలు అంశాలపై సమీక్షించారు. జిల్లాలో అధికవర్షాలు కురుస్తున్నందున నీటికాలుష్యం వల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది నిర్దేశించిన గ్రామాలు, పట్టణాల్లో విధిగా నివాసం ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అంశాలవారీగా దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైద్య అధికారులు పద్మజ, వాణిశ్రీ, భగీరథి, నోడల్ అధికారి శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 9.1మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి మంచి వర్షం కురిసింది. శనివారం ఉదయానికి 19.1 మి.మీ వర్షపాతం నమోదైంది. జరుగుమల్లి మండలంలో 40.6, కొనకనమిట్ల 35.6, సింగరాయకొండ 29.8, బేస్తవారపేట27.8, గిద్దలూరు 25.6, మార్కాపురం 22.2, పొదిలి 17.4, టంగుటూరు 16.4, కంభం 14.8, కొమరోలు 13.4, పెద్దారవీడు 12.4, వెలిగండ్లలో 11.4 మి.మీ వర్షం కురవగా మరో పది మండలాల్లో కొద్దిపాటి వాన పడింది.

చెన్నకేశవస్వామికి వెండి తట్టలు బహూకరణ

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 19 ఆంధ్రజ్యోతి: మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి 2 వెండి తట్టలు శనివారం దాతలు బహూకరించారు. విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ మండవేముల శివరామకృష్ణ 992 గ్రాముల 2 వెండి తట్టలను ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులకు అందజేశారు.



చెన్నకేశవస్వామికి వెండి తట్టలు బహూకరిస్తున్న దాతలు



ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆర్డీవోను కలిసిన జనసేన పార్టీ నేతలు

చీరాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆర్డీవో దేవరకొండ అఖిలను జనసేన పార్టీ నాయకులు గూడూరి శివరామప్రసాద్, మామిడాల శ్రీనివాసరావు తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి దీక్షధారులకు అన్నదానం

మేదరమెట్ల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : శ్రీ గణపతి మురగన్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి అయ్యప్ప దీక్షధారులకు అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో డిసెంబరు 2వ తేదీ వరకు 44 రోజులు అన్నదానం ఉంటుందని తెలిపారు. అయ్యప్ప, శివ, భవానీ, గోవింద దీక్షధారులు అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జోరుగా వైట్‌బర్లీ సాగు

- పెరుగుతున్న విస్తీర్ణం
- మిర్చిని వదిలేసి పొగాకు వైపు రైతుల చూపు



పర్చూరు ప్రాంతంలో వైట్ బర్లీ మొక్కలు నాటుతున్న వ్యవసాయ కూలీలు.. లంబాడీ తాండాలో సాగులో ఉన్న పొగాకు

పర్చూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైట్ బర్లీ మొక్కలు నాటే కార్యక్రమం పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మొక్కలు నాటే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పర్చూరు, యద్దనపూడి మండలాల పరిధిలో వైట్ బర్లీ మొక్కలు నాటే కార్యక్రమం సాగుతుంది. ఖరీఫ్ ప్రారంభం నుంచి సక్రమంగా వర్షాలు లేకపోవడం, గత ఏడాది వేల ఎకరాల్లో సాగుచేసుకున్న మిర్చి పంటలు దెబ్బతినడంతో ఖరీఫ్ సాగు నామమాత్రంగానే సాగింది. అయితే వైట్ బర్లీ పొగాకుకు దిగుబడులతోపాటు, నాణ్యమైన ధర ఉండడంతో అధిక శాతం రైతులు వైట్ బర్లీ పొగాకు సాగువైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఈఏడాది వైట్ బర్లీ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని అటు రైతులతోపాటు వ్యవసాయాధికారులు కూడా అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం వర్షం తగ్గుముఖం పట్టడంతో బురద యాతగా వైట్‌బర్లీ మొక్కలు నాటే కార్యక్రమం ఊపందుకుంది. పర్చూరు వ్యసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు మండలాలలో గత ఏడాది 20వేల ఎకరాలలో రైతులు వైట్ బర్లీ పొగాకును సాగు చేసారు. ఈ ఏడాది రెట్టింపు ఎకరాల్లో చేస్తున్నట్లు కన్పిస్తోంది.

తగ్గిన మిర్చి సాగు

మార్టూరు : గత ఏడాది పొగాకు పంట ఆశాజనకంగా ఉండటం, మిరప పంట దెబ్బతినడంతో ఈ ఏడాది మండలంలోని మిరప పంట రైతులు పొగాకు పంట సాగువైపు దృష్టి పెడుతున్నారు. ముఖ్యంగా గత ఏడాది ఎకరా పొగాకు పంట సాగుచేసిన రైతులు 2 నుంచి రూ.4లక్షల దాకా లాభాలు సాధించిన వారున్నారు. దానికి తోడు మిరపను సాగు చేసిన రైతులు నల్లతామర వైరస్‌తో సరైన ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రాక నష్టాలలో మునిగిపోయిన రైతులూ ఉన్నారు. అంతేగాకుండా మూడేళ్లుగా మిరపను సాగుతో రైతులు నష్టపోవడంతో వారంతా ఈ ఏడాది పొగాకు పంట సాగు పట్ల ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.

మిరపను తగ్గించి.. పొగాకు వేశా



ఏటా మిరప పంట సాగు చేస్తున్నాను. మూడేళ్లుగా నష్టాలు వస్తున్నాయి. గతేడాది 2 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. లాభదాయకంగా ఉంది. ఈ ఏడాది కూడా మిరపను తగ్గించి నాలుగు ఎకరాలలో పొగాకును సాగుచేశాను.

- పావులూరి విజయ్‌బాబు, నాగరాజుపల్లి

గత ఏడాది ఖరీఫ్, రబీలో 1100 ఎకరాలు మిర్చి పంట సాగుచేయగా, ఈ ఏడాది ఖరీఫ్‌లో కేవలం 380 ఎకరాలు మాత్రమే సాగుచేశారు. మండలంలో ప్రధానంగా మిరప సాగుకు నాగరాజుపల్లి, జొన్నతాళి, బొబ్బేపల్లి గ్రామాల రైతులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారు. మిగిలిన గ్రామాలలో తక్కువ మోతాదులో మిరప సాగుచేస్తారు. ఎకరాకు లక్షన్నర రూపాయలు ఖర్చు చేసి సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు మిరపకు బదులు పొగాకు సాగు చేపట్టారు. మండలంలో దాదాపుగా 200 ఎకరాలు దాకా పొగాకు సాగు చేస్తున్నారు. మార్టూరు పంచాయతీలోని లంబాడితాండా వాసులు ఏకంగా 50 ఎకరాలు దాకా పొగాకును సాగు చేస్తున్నారు. ఇంకా మండలంలో పొగాకు సాగు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది క్వింటా పొగాకు 16 నుంచి 17వేలు రూపాయల దాకా ధర పలికింది. దానికి తోడు దిగుబడి ఎకరాకు 20 క్వింటాళ్లు దాకా వచ్చింది. దాంతో పొగాకు సాగు చేసిన రైతులుకు బాగానే డబ్బులు వచ్చాయి.



బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

పథకాలను వినియోగించుకోవాలి

న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నాగవెంకటలక్ష్మి అన్నారు. పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఆహారం, తాగునీటి వసతి, ఇతర సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, స్టాక్ రూములను పరిశీలించారు. రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. హెచ్‌ఎం డీ పద్మావతి, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యర్రమోతు రమేష్, ఉచిత న్యాయ సహాయ న్యాయవాదులు షేక్ మహ్మద్ రఫీ, ఎం.ప్రకాష్ పాల్గొన్నారు.

శ్రీను మృతిపై పారదర్శక విచారణ జరపాలి

- కుటుంబ సభ్యుల ఆందోళన
- డీఎస్పీ హామీతో రాస్తారోకో విరమణ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ జగదీష్ నాయక్

చీరాలటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు అలియాస్ బాతుల శ్రీను మృతిపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు, పలువురు నాయకులు డిమాండ్ చేస్తూ శనివారం ఆందోళనకు దిగారు. ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని పెద్ద సంఖ్యలో ప్రజలు, బాధిత కుటుంబ సభ్యులు చీరాల గడియార స్తంభం సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు వారితో పాటు సెంటర్ వరకు వచ్చారు. రాస్తారోకో మొదయ్యాక ఆరోగ్య కారణణాలతో ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఉద్దేశపూర్వకంగానే హత్య కోణం దాగి ఉందని ఆరోపించారు. డీఎస్పీ జగదీష్ నాయక్ కేసును వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ముందుగా పట్టణంలోని ములాయ్ సింగ్ యాదవ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి.. అదుపులో నలుగురు

అద్దంకి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : పేకాట శిబిరంపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఖాదర్‌బాషా తెలిపారు. పట్టణం సమీపంలోని గుండ్లకమ్మ నదిలో మంచినీటి పథకాల పంప్‌హౌస్ వద్ద ఉన్న సామాజిక అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి పేకాట జరుగుతుండగా ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి దాడి చేసి, 4గురుని అదుపులోకి తీసుకొని రూ.5240 స్వాధీనం చేసుకున్నారు.

వరదకు కొట్టుకుపోయిన గేదె

అద్దంకి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరాయపాలెం సమీపంలో దోర్నపు వాగులో వరద నీటి ఉధృతికి గేదె కొట్టుకుపోయి కల్వర్టు తూములలో ఇరుక్కుపోయి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పేరాయపాలెంకు చెందిన పుట్టా శ్రీనివాసరావు గేదెల ను గురువారం సాయంత్రం మేతకు దోర్నపు వాగు వైపు తోలుకెళ్లారు. ఇంటికి వచ్చే సమయంలో గేదెలు వాగు లోకి దిగగా, ఒక గేదె వాగులో కొట్టుకుపోయి తూములలో ఇరుక్కుంది. శనివారం చనిపోయిన గేదె బయట పడింది. రూ.95వేల విలువైన గేదె మృతి చెందినట్లు రైతు తెలిపారు.

లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుండెపోటుతో మృతి



బాబుల్‌రెడ్డి

అద్దంకి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గూడా బాబుల్‌రెడ్డి (42) గుండెపోటుతో మృతి చెందారు. అద్దంకి మండలం కలవకూరుకు చెందిన బాబుల్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా లండన్‌లో పనిచేస్తున్నారు. గురువారం గుండె పోటుతో మృతి చెందినట్లు బంధువులకు సమాచారం అందింది. భార్య మల్లేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం బాబుల్‌రెడ్డి మృతదేహాన్ని కలవకూరు తీసుకురానున్నట్లు తెలిపారు.

అప్పు చెల్లించాలని గ్రామస్థుల ఆందోళన

- సుమారు 40 మంది వద్ద రుణం తీసుకున్న సిమెంట్ వ్యాపారి
- రూ.కోటి వరకూ ఇవ్వాలని బాధితుల గగ్గోలు
- రోడ్డుపై బైఠాయించిన యజమాని

బల్లికురవ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తీసుకున్న అప్పు డబ్బులు చెల్లించడం లేదని పలువురు బాధితులు శనివారం ఆందోళనకు దిగారు. కొప్పెరపాడు గ్రామానికి చెందిన సిమెంట్ దుకాణ నిర్వాహకురాలు తమ వద్ద అప్పుగా తీసుకున్న కోటి రూపాయలను ఇవ్వడం లేదని సుమారు 40 మంది బాధితులు నిరసన చేపట్టారు. కొప్పెరపాడులో సింమెంట్ దుకాణం నిర్వహించే మహిళ గ్రామంలో సుమారు 40 మంది వద్ద రూ.కోటి వరకు అప్పులు చేశారు. తాము ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని కోరుతున్నా ఆమె వారికి సరైన సమాధానం చెప్పకపోవడంతో విసిగిపోయిన వారు శనివారం సిమెంట్ దుకాణం వద్దకు వచ్చి షాపుకు తాళాలు వేసి తమ డబ్బులు ఇవ్వాలని పట్టుబట్టారు. అప్పులు తీసుకొని ఏళ్ల గడుస్తున్నా చెల్లించకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని గ్రామానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో మహిళ భర్త కరోనాతో చనిపోగా అప్పట్లో చేసిన అప్పులు ఇప్పటి వరకు చెల్లించలేదని, దుకాణం మాత్రం నిర్వహిస్తున్నారన్నారు. కూలినాలి చేసుకొని కూడబెట్టిన నగదు ఇచ్చామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు అడుగుతుంటే తమపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారని చెప్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఆందోళన చేస్తున్నవారిని పంపించేశారు. సమస్య ఉంటే చట్టప్రకారం వెళ్లాలని సూచించారు. అనంతరం బాధితులంతా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యజమాని హైడ్రామా

అప్పులు ఇచ్చిన వారు వచ్చి తమ డబ్బులు ఇవ్వండని ఆందోళనకు దిగగా, సిమెంట్ దుకాణానికి చెందిన యజనాని, ఆమె కుమార్తె అద్దంకి నార్కెట్‌పల్లి ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. తాము చనిపోతామని హైడ్రామా ఆడారు. ట్రాఫిక్‌ను నిలిపి మరి రోడ్డుకు అడ్డుగా వారు ఉండడంతో పోలీసులు వారిని బయటకు తెచ్చారు. డబ్బులు ఇచ్చిన వారు నిరసన చేయడం ఒక వంతైతే అప్పుగా తీసుకున్న వారు కూడా రోడ్డుపైకి రావడం ప్రజలను విస్మయానికి గురి చేసింది. అప్పులు ఇచ్చిన వారు, తీసుకున్న వారు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు.



సిమెంట్ దుకాణం ముందు ఆందోళన చేస్తున్న బాధితులు



వ్యాయామ ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యునిగా సెయింట్ ఆన్స్ వ్యాయామ ఉపాధ్యాయుడు

చీరాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ(కే) యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబరుగా సెయింట్ ఆన్స్ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

యువత చొరవతో మానవ అక్రమ రవాణా నియంత్రణ

డీఎస్పీ జగదీష్ నాయక్



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ జగదీష్ నాయక్, ప్రతినిధులు

చీరాలటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : యువతరం చొరవతో మానవ అక్రమ రవాణా, మహిళల రక్షణ నియంత్రించవచ్చని చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో మదర్ సర్వీస్ సొసైటీ చీరాల వారి ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడం కార్యక్రమం నిర్వహించారు. చైతన్య భారతి డిగ్రీ కళాశాల, గాయత్రి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా హాజరయిన డీఎస్పీ జగదీష్ నాయక్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా తరలించిన వారిని ఇతర ప్రాంతాల్లో యాచన చేయించడం లేక అవయవాలను విక్రయానికి పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ప్రతినిధి నాగిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సోమేశ్వరరావు, గాయత్రి స్కూల్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర, డీసీఐసీ కన్వీనర్ దాసరి ఇమ్మానియేల్, చీరాల మహిళా మండలి ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

23న సర్వసభ్య సమావేశం

పర్చూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల ప్రజా ప్రరిషత్ కార్యాలయంలో ఈనెల 23న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేకా ఆనందకుమారి ఆధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పల్లె పండుగతో అభివృద్ధి



కూకట్లపల్లిలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న అధికారులు

బల్లికురవ. అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం కన్పిస్తోందని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి, ఎస్‌ఎల్ గుడిపాడులో సీసీ రోడ్లు, గోకులం షెడ్ల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ మాధవ్, టీడీపీ నేతలు ఇప్పల అంజిరెడ్డి, అబ్రహం, అధికారులు పాల్గొన్నారు.

పంగులూరు : ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకుందని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బూదవాడ, కల్లంవారిపాలెం, చిన మల్లవరంలో సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణానికి ఎంపీడీవో స్వరూపారాణి, స్థానిక నేతలు, అధికారులతో కలసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, ఏఈ హనుమంతరావు, ఏపీవో సంతోషం, ఈవో ఆర్డీ కె.సుమంత్, టీడీపీ మండల అధ్య క్షుడు రావూరి రమేష్, బాలిన రామసుబ్బారావు, ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఉపాధి, సచి వాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : పల్లె పండుగతో గ్రామాలు, పల్లెలలో నూతన వెలుగులు సంతరించుకుంటాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి ఉషారాణి అన్నారు. వీరన్నపాలెం, పోతుకట్ల, కొమర్నేనివారిపాలెం, చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లు, మినీ గోకుల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.ప్రద్యుమ్నకుమార్, ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ఏపీవో బుల్లియ్య, మండల పార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, నాయకులు మానం హరిబాబు, షేక్ జమాలుద్దీన్, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మార్టూరు : ఉపాధి నిధులు రూ.కోటి 50లక్షలతో సీసీ రోడ్లకు శనివారం మార్టూరు పంచాయతీలో అధికారులు, టీడీపీ నాయకులు భూమి చేశారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, షేక్ రజాక్, శివనాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జాష్టి సాంబశివరావు, శ్రీను, పీఆర్ ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నల్లపనేని రంగయ్యచౌదరి, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. నాగరాజుపల్లిలో సీసీ రోడ్లుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు మిన్నెకంటి రవికుమార్, సాంబశివరావు, పోతురాజు, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇంకొల్లు : గ్రామాలలో సదుపాయాల కల్పనతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు ఇంకొల్లులో రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోఆర్డీ రాజ్యలక్ష్మి, ఏపీవో రేణుక టీడీపీ నాయకులు, ఎంపీపీ బండారు అనూష, సర్పంచ్ ఏజర్ల ప్రసన్న, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, మార్క్, మాబాషా పాల్గొన్నారు.





కల్లంవారిపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు, నేతలు.. చెరుకూరులో పాల్గొన్న నాయకులు



చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

చిన్నారుల సంరక్షణపై అప్రమత్తం

న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలోని చిన్నారుల సంరక్షణకై అప్రమత్తంగా ఉండాలని న్యాయాధికారి ఎస్.సుధ అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శనివారం కస్తూర్బా మునిసిపల్ బాలికోన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. స్కూల్‌లో వసతులపై ఆరా తీశారు. భోజన వతిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బాలికల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఎల్‌వీలు రామారావు, మదీన్, సుభాని, ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, బాబు పాల్గొన్నారు.

జనసేన పార్టీ నాయకుల అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

మార్టూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం మార్టూరు సెంటర్లో జనసేన పార్టీ నాయకులు పేదలకు అన్నదానం నిర్వహించారు. ఎన్నారై మన్యం శ్రీకాంత్ సహకారంతో ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మందపాటి కిషోర్, ముస్తఫా అంబేడ్కర్, కొండపల్లి కాశిలింగం, కందుల ప్రేమ్ కుమార్, బొబ్బేపల్లి నటరాజ్, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



హరిహర గోశాలలో ఊయల ఊగుతున్న బాలికలు

సంప్రదాయాలను కాపాడుదాం

ఉత్సాహంగా అట్లతద్దె పండుగ

అద్దంకి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు అట్లతద్దె వస్తుందంటే చాలు గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా వీధికొకటి చొప్పున పెద్ద పెద్ద ఉయ్యాలలు కనిపించేవి. వాటిలో ఊగటానికి చిన్నా పెద్దా తారతమ్యం మరిచి బాలికలు మొదలు నడి వయస్సు మహిళల వరకు ఉత్సాహం చూపించే వారు. అయితే గత రెండు, మూడు దశాబ్దాలుగా అంతా మారిపోయింది. అట్ల తద్దె అంటే మొక్కుబడిగా జరుపుకునే పండుగగా మారింది. ఈ క్రమంలో అద్దంకి పట్టణంలోని విశ్వభారతి కళాశాల సమీపంలో హరిహర గోకులంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం ఊయల ఏర్పాటు చేసి అట్ల తద్దె ఆచారం నేటి తరానికి అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. కొంతమంది బాలికలు, యువతులు ఉయ్యాలలో ఊగారు. కార్యక్రమంలో హరిహర గోకులు నిర్వాహకుడు గోనుగుంట్ల సుబ్బారావు, రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మురళీసుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, మహ్మద్ రఫీ, జాగర్లమూడి శివకుమారి, కొల్లా భువనేశ్వరి, ఊటుకూరి నాగరాజకుమారి పాల్గొన్నారు.

అటకెక్కిన అట్లతద్దె

మార్టూరు : అట్లతద్దె పండుగ జాడ గ్రామాల్లో కన్పించలేదు. అంతా కంప్యూటర్ యుగంగా మారిన నేపథ్యంలో పండుగలు, సంప్రదాయాలు అటకెక్కుతున్నాయని గ్రామాల్లో పెద్దలు వ్యాఖ్యానిస్తున్నారు. తాటివారిపాలెం గ్రామంలో మాత్రం ఊయలు ఊగడం కన్పించింది.